


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

RNI-APTEL/2023/88162

GSTIN 37AMRPM5719R1ZX


గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహానికి హాజరైన చంద్రబాబు




ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 235 | సోమవారం 31 - 08 -2026 | పేజీలు : 12 | వెల-3


## ప్రధాని మోదీకి అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం చేసిన ఉజ్బెకిస్థాన్

‘ఒలియ్ దరాజలీ దోస్తిలిక్’ అవార్డును ప్రదానం చేసిన అధ్యక్షుడు మిర్జియోయెవ్

30కి పైగా అంతర్జాతీయ అవార్డులు అందుకున్న భారత నేతగా మోదీ రికార్డు

తాష్కెంట్‌లో ఇరు దేశాల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు

ఉజ్బెకిస్థాన్‌లో ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించిన ప్రధాని

2లో



## విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి..

విశాఖలో కొలువుదీరనున్న ఏఐజీ ఆసుపత్రి

సోమవారం శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్

రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు

ప్రత్యక్షంగా, పరోక్షంగా 9,000 మందికి ఉపాధి

వెయ్యి పడకలతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు

2లో

ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య రంగం మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ ఆసుపత్రి ఇప్పుడు





# వెలిగొండకు కృష్ణమ్మ పరుగులు

మార్కాపురం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడనుంది. కరువు నేల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం లిఖిస్తూ, వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు జాతికి అంకితం చేయనున్నారు. తన చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఈ ప్రాజెక్టును, తానే ప్రారంభించే అరుదైన అవకాశం చంద్రబాబుకు దక్కింది. లక్షలాది మంది రైతుల సమక్షంలో జరగనున్న ఈ కార్యక్రమంతో పశ్చిమ ప్రకాశం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాల నుంచి కృష్ణా జలాలను తరలించే ఈ బృహత్తర ఘట్టానికి సర్వం సిద్ధమైంది. ఫీడర్ కెనాల్ గేట్లను ఎత్తి, 10.7 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్ రిజర్వాయర్‌లోకి ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేయనున్నారు. పోలవరం ప్రాజెక్టు తరహాలోనే వెలిగొండపై ప్రత్యేక దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం, గడిచిన రెండేళ్లలోనే ఈ ప్రాజెక్టు కోసం రూ.2,400 కోట్లకు పైగా ఖర్చు చేసింది. దీంతో కలగా మిగిలిపోతుందనుకున్న ప్రాజెక్టు ఇప్పుడు కళ్లముందు సాక్షాత్కరించింది. ఈ ప్రాజెక్టు పూర్తికావడంతో ప్రకాశం, మార్కాపురం జిల్లాల రైతాంగానికి సాగునీటి కష్టాలు తీరనున్నాయి.

దశాబ్దాల కలను నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబు

రేపు వెలిగొండ ఫేజ్-1 ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల కృష్ణా జలాల విడుదల

మూడు దశాబ్దాల కరువు ప్రాంత రైతుల కల సాకారం

సాగు, తాగునీటితో పాటు ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం

నిర్వాసితులకు వేగంగా పరిహారం అందించిన కూటమి ప్రభుత్వం

2లో

## నేపాల్‌లో మరో జల ప్రళయం..



నేపాల్‌లోని భోటే కోశి నదికి ఆకస్మిక వరద హెచ్చరిక జారీ

నదిలో ప్రవాహం పెరిగిన శబ్దాలు రావడంతో అప్రమత్తమైన అధికారులు

రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన

సహాయక చర్యల్లోని సిబ్బంది అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని విజ్ఞప్తి

హిమానీనదం విస్ఫోటనం తర్వాత మరో సంక్షోభంతో నేపాల్ ఆందోళన

2లో

## దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ



2లో

# దోపిడీకి పదవి అడ్డా !

## పాప జాకీర్ దోచేస్తున్నాడు ఆటోనగర్









2లో

**నంది పత్రిక నంద్యాల ఆగస్టు 30 :** నంద్యాలకు చెందిన పాప జాకీర్ ఆటోనగర్ అధ్యక్ష పదవిని అడ్డం పెట్టుకొని ఆటోనగర్ ఆస్తులను లూటీ చేస్తున్నాడని నూతన ఆటోనగర్ నాయకులు ఆరోపిస్తున్నారు. నంద్యాల పట్టణంలోని స్థానిక ఆటోనగర్ 1995 ఏర్పడిందని అప్పటి నుండి అభివృద్ధికి ఏమాత్రం నోచుకోలేదని, ఆటోనగర్లో 100 కోట్లకు పైగా పాప జాకీర్ స్వాహా చేసినట్లు నూతన ఆటోనగర్ అధ్యక్షులు పంపు టెస్టర్ భాష, సెక్రెటరీ ఎస్ మగ్బుల్ , ట్రెజరర్ ఎస్ అమీర్ భాష, సెక్షన్ ప్రెసిడెంట్ ఎస్ ఎం డి రఫీ, కమిటీ మెంబర్లు ఎస్ షఫీ, ఎస్ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటోనగర్ 1995లో టి సి ఐ ట్రాన్స్పోర్ట్ వారితో 45 ఎకరాలు, ఎకరా 1 లక్ష 60 వేల తో 45 ఎకరాలు మొత్తం 72,00,000 లక్షలతో ఆటోనగర్ స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆటోనగర్ కు 1995లో మొదటి అధ్యక్షులుగా డైమండ్ అజీస్ ఐదు సంవత్సరాలు, 1999 నుండి 2004 వరకు జి మహబూబ్ పీరా, 2004 నుండి 2013 వరకు కోహినూర్ మహబూబ్ బాషా, ఆటోనగర్లో అధ్యక్షులుగా పని చేశారని తెలిపారు. 2013 నుండి ఇప్పటివరకు పాప జాకీర్ అధ్యక్ష పదవి కొనసాగిస్తూ ఆటోనగర్ అభివృద్ధి చేయకుండా ఆటోనగర్ 100 కోట్ల రూపాయలకు పైబడి స్వాహా చేసి ఆటోనగర్ అభివృద్ధి విషయంలో చేతులెత్తేశాడని వారు తెలిపారు. ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్న పాప జాకీర్ ఆటోనగర్లో డి ఫోల్డర్ కాదని, 2008లో ఇతరులకు వచ్చిన ఐదు సెంట్లు ప్లాటును

## ‘నైరుతి’ మూడో నెలలోనూ నిరాశే



మూడో నెలలోనూ నిరాశే

రాష్ట్రంలో 53శాతం వర్షపాతం లోటు

అన్ని జిల్లాల్లోనూ వర్షాభావమే

2002 ఎల్‌నినో కంటే ఘోరం

అన్నదాతల ఆశలన్నీ సెప్టెంబరుపైనే

‘నైరుతి’ మూడు నెలల్లో

రాష్ట్రంలో 53 శాతం వర్షపాతం లోటు

2లో

## సీఎం వస్తున్నారు..



గోదావరిలో పడవపై వెళుతూ రేవుల్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

మొగల్తూరులో ప్రజావేదిక

పర్యటన ఏర్పాట్లలో ప్రజాప్రతినిధులు, అధికారులు బిజీ

అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం

2లో

# దేశవ్యాప్తంగా ముగిసిన నీట్ పీజీ

**మొత్తం 2.65 లక్షల మందికి పైగా హాజరైన అభ్యర్థులు**

**జైపూర్‌లో విద్యుత్ అంతరాయం...**

**2,445 మందికి మళ్లీ పరీక్ష**

**సెప్టెంబర్ 5న ప్రభావిత విద్యార్థులకు తిరిగి పరీక్ష నిర్వహణ**

**భారీ భద్రత, నిఘా మధ్య పరీక్షలు నిర్వహించిన ఎన్‌బీఈఎంఎస్**

దేశవ్యాప్తంగా మెడికల్ పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 2.65 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. అయితే, జైపూర్‌లోని ఒక పరీక్షా కేంద్రంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో అక్కడి అభ్యర్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (చీదీజుమీూ) ప్రకటించింది. దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 339 నగరాల్లో ఏర్పాటు చేసిన 1,111 పరీక్షా కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహించారు. మొత్తం 2.73 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 2,65,980 మంది పరీక్షకు హాజరయ్యారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పరీక్షల నిర్వహణ ప్రక్రియ అత్యంత భద్రత నడుమ, సజావుగా సాగిందని ఎన్‌బీఈఎంఎస్ ఒక ప్రకటనలో సంతృప్తి వ్యక్తం చేసింది. పరీక్షల నిర్వహణ దేశవ్యాప్తంగా సజావుగా సాగినప్పటికీ, జైపూర్‌లోని ఒక కేంద్రంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి.

దీంతో అక్కడ పరీక్ష రాస్తున్న 2,445 మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ ప్రభావిత విద్యార్థుల కోసం సెప్టెంబర్ 5వ తేదీ మధ్యాహ్నం తిరిగి పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ స్పష్టం చేసింది. అభ్యర్థులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, విద్యార్థులందరికీ సమాన అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని బోర్డు తెలిపింది. వారికి పరీక్షా కేంద్రం వివరాలు త్వరలోనే తెలియజేస్తామని హామీ ఇచ్చింది.పరీక్షల నిర్వహణను పకడ్బందీగా చేపట్టేందుకు ఎన్‌బీఈఎంఎస్ భారీ ఏర్పాట్లు చేసింది. దేశవ్యాప్తంగా 16 ప్రాంతీయ కమాండ్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

పరీక్షల తీరును పర్యవేక్షించేందుకు 2,527 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఇండిపెండెంట్ అప్రైజర్లుగా నియమించారు. అదనంగా, 700 మందికి పైగా డీన్లు, డైరెక్టర్లు, సీనియర్ ప్రొఫెసర్లతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను రంగంలోకి దించారు. అన్ని పరీక్షా కేంద్రాలను లైవ్ సీసీటీవీ నిఘాలో ఉంచారు. వీటిని ఢిల్లీ ద్వారకలోని ఎన్‌బీఈఎంఎస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ సెంటర్ నుంచి నిరంతరం పర్యవేక్షించారు. ఈ రియల్-టైమ్ నిఘా కోసం ఎన్‌బీఈఎంఎస్, టీసీఎస్‌కు చెందిన 190 మంది సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం పనిచేసింది. పరీక్షల నిర్వహణ విజయవంతం కావడం వెనుక భాగస్వాములైన వైద్య సంస్థలు, ఫ్యాకల్టీ, భద్రతా ఏజెన్సీలు, టెక్నాలజీ బృందాల సమన్వయం ఉందని ఎన్‌బీఈఎంఎస్ పేర్కొంది. అభ్యర్థులు చూపిన సహనానికి, విశ్వాసానికి ధన్యవాదాలు తెలుపుతూ, పరీక్షల నిర్వహణలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరి కృషిని అభినందించింది.

# దోపిడీకి పదవి అడ్డా !

ఆటోనగర్లో కొనుగోలు చేసి, అప్పుడున్న కమిటీ మెంబర్లను ప్రలోభ పెట్టి తన వైపు తిప్పుకొని 2013లో ఆటోనగర్ కార్మికులు తనను ఎన్నుకున్నట్లు అధ్యక్ష పదవి కొన సాగుతున్నాడని తెలిపారు. పాప జాకీ ఆటోనగర్ లో అసలు సభ్యుడే కాదని అన్నారు. ఆటోనగర్లో మొత్తం 516 మంది గాను 416 మంది డి ఫోల్డర్స్ ఉన్నారని అన్నారు. 2002లో ఎంపీ భూమా నాగిరెడ్డి ఎంపీ ఫండ్ కింద మెటల్ రోడ్లు వేశారని, అప్పుడే డిప్పుల ప్రకారం కార్మికులకు ఫ్లాట్లు ఇచ్చారని వారు గుర్తు చేశారు. ఆటోనగర్ బైలాలో ఆటోనగర్ డెవలప్ మెంట్ ప్రాపర్టీ 84 సెంట్లు పెట్రోల్ పంపు కోసం, 2 ఎకరాల 20 సెంట్లు కమిటీ హాల్, ఆఫీస్ రూమ్, కమిటీ డెవలప్మెంట్ కోసం, గ్రీన్ ల్యాండ్ 50 సెంట్లు, మరియు 30 సెంట్లు తీయడం జరిగిందని, డెవలప్మెంట్ కోసం తీసిన స్థలాలు ఎవరికి తెలియకుండా గుట్టుచప్పుడుగా ఆటోనగర్ అధ్యక్షులు పాప జాకీర్ అమ్ముకోవడం జరిగిందని ఆరోపించారు. ఆటోనగర్లో ఆఫీస్ కమిటీ కోసం ఉంచిన 20 సెంట్లు స్థలాన్ని ఎక్స్ కౌన్సిలర్ జాకీర్ కబ్జా చేశాడని అన్నారు. ఆటోనగర్లో స్థలాలు రిజిస్టర్ చేస్తానని, రిజిస్టర్ కోసం 35 వేల రూపాయలు ఖర్చు వస్తే, కార్మికులతో ఒక్కొక్కరితో 45 వేల రూపాయలు డబ్బులు కట్టించుకుని రిజిస్టర్ చేసి ఇచ్చిన వారికి ఇప్పటికీ స్థలము చూపించలేదని అన్నారు. వారు 15 మంది ఉన్నారని, రిజిస్టర్ కోసం డబ్బులు కట్టించుకున్న వారికి రిజిస్టర్ చేసి ఇయ్యలేదని, వారు 40 మంది వరకు ఉన్నారని, రిజిస్టర్ టైంలో నంద్యాల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వంద రూపాయల స్టాంపులు దొరకలేదని, సిరివెళ్ల నుండి తెప్పించామని వంద రూపాయల స్టాంపుకు 2,000 రూపాయలు వసూలు చేశాడని ఆరోపించారు. ఆటోనగర్ డెవలప్మెంట్ కోసం ఉంచిన స్థలాలు ఎవరికి తెలియకుండా అమ్ముకున్నాడని, పాప జాకీర్ ఆటోనగర్లో అవినీతికి పాల్పడి 100 కోట్లకు పైగా స్వహ చేశాడని, ఆటోనగర్లో లెక్కలు చూపించి అధ్యక్ష పదవి నుండి తప్పుకోవాలని కార్మికులు డిమాండ్ చేసినప్పటికీ, రాజకీయ పార్టీ నాయకుల అండదండలతో ప్రతి ఒక్కరికి బెదిరించుకుంటూ, లెక్కలు పంచుకుంటూ, ఆటోనగర్లో ఎటువంటి అభివృద్ధి చేయలేదని అన్నారు. అభివృద్ధి పేరుతో తప్పుడు లెక్కలు చూపిస్తూ కోట్ల రూపాయలు స్వాహా చేశాడని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే క్రింది స్థాయి ఉద్యోగస్తులకు, బయటి వ్యక్తులకు ఆటోనగర్లో స్థలాలు ఇప్పిస్తానని చెప్పి ప్రలోభ పెట్టి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశాడని ఆరోపించారు. ఆటోనగర్ లో జరుగుతున్న అవినీతి అక్రమాలను ఎవరైనా కార్మికులు ప్రశ్నిస్తే, వారిపై రౌడీయిజం, గూండాయిజం చేసేందుకు కూడా జాకీర్ వెనుకాడడని పేర్కొన్నారు. పాప జాకీర్ ఏ ఎండకు ఆ గొడుగు పట్టుకుంటూ తన అధ్యక్ష పదవిని కాపాడుకుంటూ పబ్బం గడుపుకుంటున్నాడని పేర్కొన్నారు. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా ఆటోనగర్లో స్థలాలు రిజిస్టర్ చేసి, దర్జాగా బతికేస్తున్నాడని తెలిపారు. ఆటోనగర్లో పాప జాకీర్ చేసిన అవినీతి అక్రమాలపై, మాజీ ఎమ్మెల్యే భూమ బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి కూడా పాప జాకీర్ అవినీతి అక్రమాలు తీసుకువెళ్లామని, పాప జాకీర్ అవినీతి బట్టబయలు చేయాలని నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద రాస్తారోకో కూడా చేశారని, మరియు పోలీస్ స్టేషన్లో పాప జాకీర్ పై ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. ఆటోనగర్లో పాప జాకీర్ చేసిన అవినీతి అక్రమాలపై అధికారులు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం కోరిన అధికారులను పాప జాకీర్ ప్రలోభ పెట్టి ఆటోనగర్ లో ఎటువంటి అవినీతి అక్రమాలు జరగలేదని పాప జాకీ అధికారులతో నివేదిక ఇప్పించడం జరిగిందని, ఇలాంటి సందర్భాలలో పాప జాకీర్ తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి డబ్బులు వెదజల్లుతూ బయట పడుతున్నాడని అన్నారు. ఆటోనగర్లో ఎక్కడ కూడా రోడ్లు వేసిన పాపాన లేదని, వర్షం వస్తే ఆటోనగర్ పరిస్థితి పూర్తి అధ్వానంగా ఉంటుందని, ఆటోనగర్ కార్మికులు ఆటోనగర్లో పని చేసుకోవడానికి రావాలన్న వర్షాకాలంలో చాలా ఇబ్బందులకు గురివుతున్నారని పేర్కొన్నారు. ఆటోనగర్ అభివృద్ధి చేయకుండా, అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటూ ఉన్నాడని తెలిపారు. ఆటోనగర్ ప్రస్తుత అధ్యక్షులు పాప జాకీర్ పాపం పండిందని, ఆటోనగర్ యొక్క లెక్కలు చూపించి తన అధ్యక్ష పదవికి రాజీనామా చేసే వరకు వివిధ రకాల పోరాటాలు చేసి ప్రభుత్వం దృష్టికి వెళ్లెంతవరకు పోరాటాలు చేస్తామని, ఇంతటితో ఆగేదే లేదని, కార్మికుల క్షేమం, ఆటో నగర్ అభివృద్ధి కోసం విశ్రమించేది లేదని నూతన కమిటీ అధ్యక్షులు పంపు టెస్టర్ భాష, సెకరెటరీ మగ్బుల్ , ట్రెజరర్ ఎస్ అమీర్ భాష, సెక్షన్ ప్రెసిడెంట్ ఎస్ ఎం డి రఫీ, కమిటీ మెంబర్లు ఎస్ షఫీ, ఎస్ హుస్సేన్, తెలిపారు.

## గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె వివాహానికి హాజరైన చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ పార్టీ నేతల ఇళ్లలోని శుభకార్యాలకు హాజరయ్యారు. ఆదివారం ఒకే రోజు రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివరాల్లోకి వెళ్తే, అనంతపురం జిల్లా గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తె విద్య, అనంతపురం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడి కుమారుడు శివరాజుల వివాహం ఆదివారం ఘనంగా జరిగింది. అనంతపురం పట్టణంలోని ఎమ్‌వైఆర్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఈ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా హాజరయ్యారు. వేదికపైకి వెళ్లి నూతన దంపతులు శివరాజు-విద్యలను మనసారా ఆశీర్వదించి, వారికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరు కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. ముఖ్యమంత్రి రాకతో వివాహ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. అనంతరం, తన పర్యటనలో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గానికి వెళ్లిన చంద్రబాబు, అక్కడ కూడా మరో వివాహ వేడుకలో పాలుపంచుకున్నారు. స్వర్గీయ పీఆర్ మోహన్ - ఇందిర దంపతుల కుమార్తె డింపుల్, రాజేష్‌ల వివాహానికి హాజరై నూతన జంటను ఆశీర్వదించారు.



# 'నైరుతి' మూడో నెలలోనూ నిరాశే

నైరుతి రుతుపవనాల సీజన్‌లో మొదటి మూడు నెలల కాలం సోమవారంతో పూర్తికానుంది. ఈ 3 నెలల కాలంలో రాష్ట్రంలో పట్టుమని వారం రోజులు కూడా విస్తారంగా వర్షాలు కురవలేదు. ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చే వరదతో కొన్ని రిజర్వాయర్లలోకి నీరు చేరిందే తప్ప... వాగుల్లో నీటి ప్రవాహం లేదు. చెరువుల్లో చుక్క వర్షం నీరు చేరలేదు. జూన్ ఒకటో తేదీ నుంచి ఆగస్టు 30వ తేదీ వరకు రాష్ట్రంలో 418.9 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా.. 196.7 మి.మీ. (సాధారణం కంటే 53 శాతం తక్కువ) మాత్రమే వర్షం కురిసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వర్షాభావం కొనసాగింది. దేశంలో బిహార్ తర్వాత ఏపీలోనే అత్యధికంగా వర్షాభావం నెలకొంది. భారత వాతావరణ శాఖ(ఐఎండీ) రికార్డుల మేరకు 1970 తర్వాత 1997, 2002, 2009, 2015, 2023 సంవత్సరాలలో తీవ్రమైన ఎల్‌నినోలు నమోదు కాగా, వాటిలో 2002ను అత్యంత దుర్భిక్షమైన సంవత్సరంగా నిపుణులు విశ్లేషించారు. ఆ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఏపీలో 26 శాతం లోటు వర్షపాతం నమోదవగా, ప్రస్తుత ఏడాది అంతకుమించి వర్షాభావం నెలకొంది. శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఏ ఒక్క జిల్లాలో కూడా సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పసిఫిక్ మహాసముద్రం నుంచి వీచే రుతుపవనగాలులు భారతదేశం వైపు రాకుండా దక్షిణ చైనా వైపు వెళ్లడంతో దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువ వర్షాభావానికి గురయ్యాయని రిటైర్డు వాతావరణ అధికారి ఒకరు తెలిపారు. ఈ ప్రభావంతో బంగాళాఖాతంలో ఏర్పడుతున్న అల్పపీడనాల వల్ల కోస్తాంధ్రలో కొద్దిపాటి వర్షం కురుస్తున్నదే తప్ప వాగులు పొంగి, చెరువులు నిండేటంత వర్షాలు పడడం లేదు. ఈ నేపథ్యంలో సెప్టెంబరుపైనే రైతులు గంపెడాశ పెట్టుకున్నారు. సెప్టెంబరు రెండో వారంలో రుతుపవనాల నిష్క్రమణ ప్రారంభమవుతుంది. గత కొన్ని సంవత్సరాల గణాంకాలను పరిశీలిస్తే.. సెప్టెంబరులో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. అయితే బలమైన ఎల్‌నినో కొనసాగుతున్నందున ఈ ఏడాది సెప్టెంబరులో వర్షాలు పెరుగుతాయా? లేదా వర్షాభావం కొనసాగుతుందా? అన్నదానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రుతుపవనాల నిష్క్రమణ సమయంలో రుతుపవనద్రోణి ఉత్తరాది నుంచి దక్షిణాది వైపుగా రానున్న నేపథ్యంలో వర్షాలు పెరుగుతాయని కొందరు నిపుణులు అంచనావేస్తున్నారు. దీంతో బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడనాలు కొంత మేలు చేస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు.

**బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం..** ఇదిలావుండగా శనివారం బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఆదివారం బలపడి తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్‌ను ఆనుకుని కొనసాగుతున్నది. ఇది సోమవారానికి పశ్చిమ వాయవ్యంగా పయనించి ఝార్ఖండ్‌వైపు వెళ్లనుందని ఐఎండీ తెలిపింది. దీని ప్రభాంతో ఉత్తరకోస్తాలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.

# సీఎం వస్తున్నారు..

మొగల్తూరు కుక్కలవారితోటలో హెలిప్యాడ్ నిర్మాణం, రాజ్యలక్ష్మి అమ్మవారి కాలనీలో కార్యకర్తల సమావేశం, కొండావారిపాలెం జాతీయ రహదారి వెంబడి స్థలంలో ప్రజా వేదిక నిర్వహణకు ఏర్పాట్లులో అధికారులు నిమగ్నమయ్యారు. మొగల్తూరులో సీఎం హెలీప్యాడ్ దిగి నరసాపురం పట్టణం 2, 3 వార్డుల్లోని పొన్నపల్లి ఏటిగట్టు వరకూ రోడ్ షోకు ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి ఇలా అన్ని శాఖలు వేగవంతంగా పనులు నిర్వహిస్తున్నారు. హెలీప్యాడ్, కార్యకర్తల సమావేశ ప్రాంగణం, ప్రజావేదిక ప్రాంగణంలో అంతర్గత రహదారులు, ప్రత్యేక షెడ్లు నిర్మాణం చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం నాటికి ఏర్పాట్లు పూర్తిచేసే దిశగా ఆయా శాఖల అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రాం కమిటీ చైర్మన్ పెందుర్తి వెంకటేశ్వరరావు, ఇన్‌చార్జ్ రామరాజు, రాష్ట్ర మైనార్టీ విభాగం సలహాదారు ఎం.ఏ షరీఫ్, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, కొల్లు పెద్దిరాజు, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కొప్పాడి రవీంద్రనాథ్ ఠాగూర్, ఏఎంసి చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణలతో పాటు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ, ఏఎస్పీలతో పాటు వివిద శాఖల జిల్లా డివిజన్, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించి దిగువ సిబ్బందికి పలు సూచనలు చేశారు. మరో వైపు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నారాయణ నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బా రాయుడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

### కలెక్టర్ సమీక్ష

కలెక్టర్ సీహెచ్ నాగరాణి మొగల్తూరులో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నరసాపురంలో సీఎం నుంచి పింఛన్ అందుకునే లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సీఎం పర్యటన సాఫీగా సాగేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి సభా స్థలి వద్ద రెండు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. పింఛన్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లే ఏటిగట్టు మార్గాన్ని పటిష్టం చేశారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సీఎం ప్రయాణించే రహదారికి తక్షణ మరమ్మతులు చేయడంతో పాటు చెత్తచెదారం శుభ్రం చేశారు.

### పార్టీ నేతల సమావేశాలు

ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి కూటమి నాయకులు పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. జనసేన శ్రేణులతో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, టీడీపీ నాయకులతో ఇన్‌చార్జి రామరాజు సమావేశమై జన సమీ కరణపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గ్రామాల వారీగా పార్టీ శ్రేణుల రాకతో పాటు పార్టీ సానుభూతిపరుల్ని తీసుకొచ్చేవిధంగా కృషి చేయాలని కోరుతు న్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లనే పరివేక్షించే పెందుర్తి వెంకటేష్ అధికారులు, పార్టీ నేతలతో సమావేశమై ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నర సాపురం నియోజకవర్గానికి తొలిసారి రానుండడంతో విజయవంతం చేసేం దుకు పార్టీ శ్రేణులు కృషి చేస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార అభివృద్ధి మండలి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, నరసాపురం నియోజకవర్గ పరిశీలకుడు దాసరి శ్యాంచంద్రశేషు పార్టీ శ్రేణులతో చర్చలు జరిపారు. సీఎం పార్టీ శ్రేణులతో సుమారు రెండున్నర గంటల పాటు ముఖాముఖి నిర్వహించనుండడం కేడర్‌లో ఆనందాన్ని నింపింది. పార్టీ అధినేతతో నేరుగా మాట్లాడే అవకాశం లభించడంతో ఏం చెప్పాలనేది సిద్ధం చేసుకుంటున్నారు. సీనియర్లతో పాటు మహిళా కార్యకర్తలు సీఎంతో మాట్లాడేందుకు నేతలు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ప్రజావేదిక, హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లను ఇన్‌చార్జి రామరాజు పర్యవేక్షిస్తున్నారు.

## రేపే వెలిగొండకు కృష్ణమ్మ పరుగులు..

దీంతో పాటు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలను పట్టిపీడిస్తున్న తీవ్రమైన ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందించే కార్యక్రమానికి కూడా ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. కృష్ణమ్మ రాకతో కరవు నేలలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. కేవలం మూడు విడతల్లోనే 6,206 కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారాన్ని వేగంగా అందించింది. అదనంగా మరో రూ.169 కోట్లను కూడా ప్రకటించింది. 2019 తర్వాత 18 ఏళ్లు నిండిన యువతకు రూ.2 లక్షల చొప్పున పరిహారం, 4,933 పశువులకు 30 రోజుల పాటు దాణా, 10 వేల కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్నారు. నిర్వాసిత మహిళలను గౌరవించేలా చీర, పసుపు, కుంకుమ అందించాలన్న సీఎం ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ చారిత్రక ఘట్టాన్ని 'వెలిగొండ పండుగ'గా జరుపుకునేందుకు ప్రతి గ్రామం కళకళలాడుతోంది.

## ప్రధాని మోదీకి అత్యున్నత పౌర పురస్కారం ప్రదానం చేసిన ఉజ్బెకిస్థాన్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. మధ్య ఆసియా దేశమైన ఉజ్బెకిస్థాన్ తమ దేశ అత్యున్నత పురస్కారమైన 'ఓలియ్ దరాజలీ దోస్తిలిక్' ఆర్డర్‌తో ఆయన్ను సత్కరించింది. ఆదివారం తాష్కెంట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షావ్కత్ మిర్జియోయెవ్ ఈ పురస్కారాన్ని మోదీకి ప్రదానం చేశారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. ఈ పురస్కారంతో, ప్రధాని మోదీ ప్రపంచవ్యాప్తంగా అత్యధిక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న భారత నేతగా తన రికార్డును మరింత పదిలం చేసుకున్నారు. ఇప్పటివరకు ఆయన 30కి పైగా ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవ డాక్టరేట్లు అందుకున్నారు. గత జులైలోనే ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో ఆ దేశ అత్యున్నత పురస్కారం 'బింటాంగ్ ఆదిపుర్న'ను మోదీకి బహూకరించిన విషయం తెలిసిందే. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్‌లో ఘన స్వాగతం లభించింది. అధ్యక్షుడు మిర్జియోయెవ్ స్వయంగా మోదీకి స్వాగతం పలికారు. అనంతరం ఇరు నేతల మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తన పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ ఓ ప్రత్యేక యోగా సెషన్‌ను వీక్షించారు. ఉజ్బెకిస్థాన్‌కు చెందిన 52 మంది యోగా అభ్యాసకులు ఇందులో పాల్గొన్నారు. వారి ప్రదర్శనను ప్రశంసించిన మోదీ, ఉజ్బెకిస్థాన్‌ను యోగాతో అనుసంధానిస్తున్నందుకు అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. 'ఉజ్బెకిస్థాన్ యోగాను ప్రేమిస్తోంది!' అంటూ ఈ వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అహ్మదాబాద్‌లో జరిగిన ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ఆరుగురు క్రీడాకారులు కూడా ఈ ప్రదర్శనలో ఉండటం విశేషం.

# విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి..

విశాఖపట్నంలో తన శాఖను ఏర్పాటు చేయనుంది. ప్రజాప్రభుత్వ పాలనలో అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో, ఈ ప్రపంచ స్థాయి వైద్య సంస్థ రాక ఆరోగ్య రంగానికి మరింత బలాన్ని చేకూర్చనుంది. నగరంలోని ఎండాడ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ఆసుపత్రికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, రాష్ట్ర ప్రజలు ఇకపై అత్యున్నత వైద్యం కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుంది.

**భారీ పెట్టుబడి, ఉపాధి అవకాశాలు** : విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ రాబోయే ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి మొత్తం సామర్థ్యం వెయ్యి పడకలకు చేరుకుంటుంది. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ద్వారా రోజుకు 5,000 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిన తర్వాత సుమారు 1000 మంది డాక్టర్లు ఇక్కడ సేవలు అందించనున్నారు.

**ప్రాజెక్టు స్వరూపం, నిర్మాణ ప్రణాళిక** : విశాఖలోని ఎండాడలో మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి క్యాంపస్‌ను, మరో 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను నిర్మించనున్నారు. వైద్య సేవలు, శిక్షణ, పరిశోధనలతో పాటు రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను ఒకేచోట ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. మొదటి దశలో టవర్-ఏ, టవర్-బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో చేపట్టి, 2028 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో టవర్-సి నిర్మాణాన్ని 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లోని ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రత్యేక మాతా శిశు విభాగం కూడా ఉంటుంది.

**పరిశోధన, శిక్షణకు పెద్దపీట** : వైద్య సేవలతో పాటు విద్య, పరిశోధనలకు ఏఐజీ పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నర్సింగ్ కళాశాల, సిబ్బందికి హాస్టల్, పారామెడిక్ సిబ్బందికి శిక్షణా కేంద్రం, 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సెంటర్‌ను ఏర్పాటు చేయనుండటం విశేషం. విజిటింగ్ ఫ్యాకల్టీ, వైద్యుల కోసం వసతితో పాటు రోగుల సహాయకుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారు. వైద్య రంగంలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఏఐజీ, ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టినల్ ఎండోస్కోపీ యూనిట్‌గా గుర్తింపు పొందింది. ఈ ఆసుపత్రి రాకతో విశాఖ హెల్త్‌కేర్ హబ్‌గా మారడమే కాకుండా, ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# నేపాల్‌లో మరో జల ప్రళయం..

ఇటీవలే హిమానీనదం విస్ఫోటనం కారణంగా తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్న నేపాల్‌ను మరో ముప్పు భయపెడుతోంది. భోటే కోశి నదిలో నీటి ప్రవాహం ఆకస్మికంగా పెరగడంతో జాతీయ విపత్తు అవాయ తగ్గింపు, నిర్వహణ అథారిటీ (ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ) నేడు తీవ్ర వరద హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు, స్థానిక అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించింది. టిబెట్ సరిహద్దు సమీపంలో హిమాలయాల్లో హిమానీనదం కూలిపోవడంతో అనేక గ్రామాలు ధ్వంసమై, భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. ఈ పెను విషాదం నుంచి కోలుకోకముందే ఇప్పుడు భోటే కోశి నది నుంచి మరో ప్రమాదం పొంచి ఉంది. "భోటే కోశి నదిలో వరద ప్రవాహం పెరిగిన శబ్దాలు వినిపించినట్టు రసువా జిల్లా పరిపాలన కార్యాలయానికి సమాచారం అందింది" అని ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ ద్వారా వెల్లడించింది. ఈ సమాచారం మేరకు రసువా, నువాకోట్, ధాదింగ్ జిల్లాల అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. నది చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తదుపరి సమాచారం అందిన వెంటనే మరిన్ని వివరాలు అందిస్తామని తెలిపింది. కొద్దిసేపటికే ఎన్‌డీఆర్‌ఆర్‌ఎంఏ మరో పోస్ట్ చేసింది. భోటే కోశిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు నివేదికలు అందుతున్నాయని, అందువల్ల సహాయక చర్యల్లో పాల్గొంటున్న సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. "రసువాలోని భోటే కోశి నదిలో వరద ప్రవాహం మరింత పెరిగినట్లు తెలుస్తోంది. కాబట్టి రసువా, నువాకోట్, ధాదింగ్, చిత్వాన్ సహా ప్రభావిత ప్రాంతాలలో సహాయ, పునరావాస కార్యక్రమాలలో నిమగ్నమైన సిబ్బంది, నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని విజ్ఞప్తి చేసింది. ఈ ఆకస్మిక పరిణామంతో నేపాల్ అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. సహాయక బృందాలను అప్రమత్తం చేస్తూ, నష్టం జరగకుండా చర్యలు ముమ్మరం చేసింది.

నంది పత్రిక
సోమవారం 31 - 08 -2026

# సీనియర్ న్యాయ వాదికి ఎపి హైకోర్టు మీడిఎషన్ సర్టిఫికెట్ ప్రధానం.




**బేతంచెర్ల ఆగస్టు 30 (నందిపత్రిక ).** సీనియర్ న్యాయవాది నందిపల్లె నారాయణ.( బేతంచెర్ల వాసి ) కు ఏపీ. హైకోర్టు మీడియేషన్ సర్టిఫికెట్ ను జిల్లా జడ్జి కబర్ది,డిఎల్ఎస్ఎ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రిలు ప్రధానం చేశారు.2025 సంవత్సరం లో ఏపీ.హైకోర్టు మీడియేషన్ ట్రైనింగ్ పూర్తి చేసిన డోన్ ప్రముఖ సీనియర్ న్యాయవాది నందిపల్లె నారాయణకు ఏపీ స్టేట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యం ద్వారా కర్నూలు జిల్లా కోర్టు డీఎల్ఎస్ఏ లో శనివారం జిల్లా జడ్జి కబర్ది డియెల్యేషన్ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి మీడియేషన్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఉమ్మడి జిల్లాలోని 2025 బ్యాచ్ 27 మంది మీడియేటర్ అడ్వకేట్స్ ఈ సర్టిఫికెట్స్ అందచేశారు. ఇప్పటి వరకు డోన్ కోర్టు కాంప్లెక్ లోని 18 కేసులను ఇరువర్గాల కక్షిదారులు,ఆయా న్యాయ వాదుల సమక్షంలో ఉచితంగా న్యాయం చేసినట్లు నందిపల్లె నారాయణ తెలిపారు. మీడియేషన్ ద్వారా కేవలం 3 నెలల్లో అన్ని రకాల కేసులను ఇరువర్గాల కక్షిదారులు, ఆయా పార్టీల న్యాయవాదుల ఆధ్వర్యంలో ఉచితంగా న్యాయం పొందవచ్చని ఆయన తెలిపారు. మీడియేషన్ ద్వారా కేసులు పూర్తి చేసుకుంటే అప్పీల్ కూడా వెళ్లేందుకు అవకాశం ఉండదని, త్వరగా స్నేహ పూర్వకంగా మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పూర్తి చేసుకోవచ్చని పూర్తి వివరాలకు, మీ కేసు ఉన్న కోర్టు లో నేరుగా కేసు వివరాలతో తమ న్యాయ వాది లేదా ఆయా కోర్టు లేదా కర్నూలు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న,జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యాలయం లో సంప్రదించ వచ్చు నని తెలిపారు.

# అభివృద్ధి పనుల పురోగతిపై డోన్ ఎంఎల్ఎ కోట్ల సమీక్ష.



**బేతంచెర్ల ఆగస్టు 30 (నందిపత్రిక ).**బేతంచర్ల పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలోడోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలోనగర పంచాయితీ,పబ్లిక్ హెల్త్, రెవెన్యూ,విద్యుత్,పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. పట్టణంలో కొనసాగుతున్న తాగునీటి పైపులైన్ పనులు, భూసేకరణ అంశాలు,విద్యుత్ స్థంబాల మార్పిడి,రహదారులపునరుద్ధణ,డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి వంటి అంశాలపై ఎమ్మెల్యేకోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి శనివారం నాడు సమగ్రంగా సమీక్షించారు. అమృత్ 2.0 పథకం కింద చేపడుతున్న పనులు ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చే విధంగా ఉండాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు.శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేసి,నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కడప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైయస్సార్ సిపి మండల నేత పెడబల్లి గణేష్ రెడ్డి మృతికి రెడ్యం సంతాపం.

### మంచి మనిషి, గణేష్ రెడ్డి మృతికి అత్యంత బాధాకరం:రెడ్యం

**కడప నంది పత్రిక ప్రతినిధి ఆగష్టు 30** చెన్నూరు రెడ్డి వీధికి చెందిన పెడబల్లి గణేష్ రెడ్డి (66) అనారోగ్యంతో హైదరాబాదులోని వారి కుమార్తె స్వగృహంలో ఆదివారం తెల్లవారుజామున మరణించారు. గణేష్ రెడ్డి మధుదేహాన్ని వారి స్వగృహం చెన్నూరుకు తెచ్చారు. వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆదివారం మధ్యాహ్నం గణేష్ రెడ్డి స్వగృహంలో ఆయన మృతదేహంపై పూలమాలవేసి ఘన నివాళి అర్పించి, ప్రగాడ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తపరిచారు. పెడబల్లి గణేష్ రెడ్డి తమ్ముడు డి.సి.ఎం.ఎస్ మాజీ చైర్మన్ పెడబల్లి ప్రతాపరెడ్డి, కుమారుడు పెడబల్లి ప్రదీప్ రెడ్డిని పరామర్శించి, ఓదార్చి ధైర్యం చెప్పారు. మంచి మనిషి, నిజాయితీ, నిబద్ధత కలిగిన గణేష్ రెడ్డి నాకు చిరకాల మిత్రుడని ఆయన మృతి అత్యంత బాధాకరమని... మృతుని తాను జీర్ణించుకోలేక పోతున్నానని రెడ్యం ఆవేదన వ్యక్తపరిచారు.



## చనిపోయిన టిడిపి నాయకుడు నాగ విజయప్ప కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంఎల్ఎ కోట్ల.



**బేతంచెర్ల ఆగస్టు 30 (నందిపత్రిక ).** బేతంచర్ల మండలంలోని ఎంబాయి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నాగ విజయప్పఇటీవల పరమపదించిన సందర్భంగా, కొన్ని అనివార్య కారణాల వల్ల అంత్యక్రియల సమయంలో హాజరు కాలేకపోయిన డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి శనివారం స్వయంగా వారి నివాసానికి వెళ్లి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి,ఈ క్లిష్ట సమయంలో మనోధైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు.అలాగే విజయప్ప ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి భగవంతుడు మరింత ధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు.

# మర్రిపాడులో విలేకరిపై దాడికి యత్నం

### భూ కబ్జా వార్త రాసినందుకు బెదిరిపు

**మర్రిపాడు ఆగష్టు 29 నంది పత్రిక :** మర్రిపాడు మండల కేంద్రంలో సర్వే నెంబర్లు 511, 512 లలో గల ముస్లిం సోదరులకు చెందిన 12 ఎకరాల భూమిని గంగవరపు వెంకటేశ్వర నాయుడు మరియు గంగవరపు శ్రీధర్ నాయుడు అనే వారు భూకబ్జా చేస్తున్నారని 'అంతిమ తీర్పు' పత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ వార్త రాసినందుకు ఆగ్రహించిన గంగవరపు శ్రీధర్ నాయుడు అనే వ్యక్తి, 'అంతిమ తీర్పు' రిపోర్టర్ సయ్యద్ గౌస్ బాషా ఇంట్లోకి అక్రమంగా జొరబడి దాడికి యత్నించారని బాధితుడు ఆరోపిస్తున్నారు. "ఈ విధంగా వార్త రాస్తే నిన్ను చంపేస్తాను" అంటూ బెదిరిస్తూ, ఇంట్లోకి జొరబడి గౌస్ బాషా గొంతు నొక్కి దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై బాధితుడు సంబంధిత అధికారులకు ఫోన్ చేయగా స్పందించలేదని, ఎస్ఐ బలరాం రెడ్డికి, 100 నంబర్ కు ఫోన్ చేసినా సరైన స్పందన లభించలేదని బాధిత విలేకరి వాపోయారు. ఘటనపై వెంటనే స్పందించి నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విలేకరులకు రక్షణ కల్పించాలని పాత్రికేయులు కోరుతున్నారు.

## పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్‌కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి




**కడప, బ్యూరో చీఫ్ ఆగస్టు 30: నంది పత్రిక** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్) ద్వారా అందుతున్న సేవలపై ప్రజలు తమ స్పందన తెలియజేయాలని జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా మరింత పారదర్శకత, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిరంతర అభిప్రాయ సేకరణ చేసి ప్రజల సంతృప్తి స్థాయిని మెరుగుపరచడం, వ్యవస్థను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను కోరుతుందన్నారు. పిజిఆర్ఎస్ కేంద్రాలను సందర్శించే పౌరుల నుండి అభిప్రాయాన్ని సేకరించేందుకు జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాలలో, వివిధ మాధ్యమాల్లో ప్రజల అభిప్రాయ సేకరణకు క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. జిల్లా, మండల స్థాయి పిజిఆర్ఎస్ కేంద్రాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించాలని ఆదేశించారు. క్యూ. ఆర్ కోడ్‌ను స్పష్టంగా, కంటికి కనిపించే పరిమాణంలో ముద్రించి, ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ప్రాంతాలలో ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పౌరులు పిజిఆర్ఎస్ సేవలను పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. . ఎక్కువ సంఖ్యలో పౌరులు భాగస్వామ్యం అయ్యే విధంగా నోటీసు బోర్డులు, హెల్ప్ డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, తదితర ప్రదేశాల్లో పెట్టాలని కలెక్టర్ సూచించారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ కు చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ ను వినియోగించుకోవాలని, తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోను, మండల కార్యాలయాల్లోనూ నిర్వహించే పి.జి.ఆర్.ఎస్ లో అర్జీలు అందించండి, వాటిపై మీ స్పందన క్యూ.ఆర్ కోడ్ ద్వారా తెలియజేయండి అని కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## నీట్ - పీజీ పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ... కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** నీట్ - పీజీ పరీక్ష సందర్భంగా కర్నూలు లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదివారం పరిశీలించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, అభ్యర్థుల ప్రవేశ ప్రక్రియలను ఎస్పీ స్వయంగా పరిశీలించి పోలీసు అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. కర్నూలు డా.కె వి సుబ్బారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , కర్నూలు జి. పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్షా కేంద్రాలను కర్నూలు ఎస్పీ పరిశీలించారు.పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని కేంద్రాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పరీక్ష పూర్తయ్యే వరకు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. కర్నూలు ఎస్పీ తో కర్నూలు డిఎస్పీ రాఘవేంద్ర, సిఐలు , ఎస్సైలు ఉన్నారు.

# పాము కాటుతో రైతు మృతి.



**బేతంచెర్ల ఆగస్టు 30 ( నందిపత్రిక ).** బేతంచెర్ల మండలం ఆర్.కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు గురు మోహన్ (45 సం.లు ) ఆదివారం నాడు, పొలం నందు పని చేస్తుండగా,పాము కాటుకు గురై మృతి చెందడం జరిగింది. పాము కాటు వేసిన వెంటనే గురుమోహన్ ను అక్కడి నుండి,బేతంచెర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వచ్చారు. డాక్టర్లు పరిశీలించగా అప్పటికే ఆయన మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య శివలక్ష్మి ఒక కుమారుడు,ఒక కుమార్తె కలరు.ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు నివ్వెర పోయారు.తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆర్.కొత్త పల్లె గ్రామములో విశాధ ఛాయాలు అలుము కున్నాయి.

# 14 లక్షలతో నూతన తాగు నీటి పైపు లైన్ కు భూమి పూజ.

### డోన్ ఎం ఎల్ఎ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి.



**బేతంచెర్ల ఆగస్టు 30 (నందిపత్రిక ).** బేతంచర్ల పట్టణంలోని శ్రీ సాయిబాబా గుడి సమీపం నుంచి రైల్వే గేట్ల వరకు రూ.14 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన తాగునీటి పైపులైన్ పనులకు గౌరవనీయులు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా మరింత మెరుగు పడేలా అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఈ పైపులైన్ నిర్మాణం పూర్తయిన అనంతరం సంబంధిత ప్రాంతాల ప్రజలకు తాగునీటి సరఫరా సౌకర్య వంతంగా అందు బాటులోకి వస్తుందని తెలిపారు.కార్యక్రమం లో బేతంచెర్ల నగర పంచాయితీ కమీషనర్ డి. హరిప్రసాద్ టిడిపి పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి పంచాయితీ సిబ్బంది టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# టిడిపి సభ్యురాలు చల్లా వీరమ్మ కుటుంబానికి 5 లక్షల చెక్ అందజేత.

### చెక్ అందజేసిన డోన్ ఎంఎల్ఎ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి.



**బేతంచెర్ల ఆగస్టు 30 ( నందిపత్రిక ).** డోన్ ఎంఎల్ఎ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి శనివారం బేతంచర్ల మండలంలోని బుక్కాపురం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా బుక్కాపురం గ్రామానికి చెందిన, టీడీపీ కుటుంబ సభ్యురాలు చల్లా వీరమ్మ చిత్ర ఫటానికి పూల మాల వేశారు.దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో,చల్ల వీరమ్మ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరపున ఆర్థిక సాయం అందించడం జరిగింది.ఈ సందర్భంగా డోన్ శాసన సభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి,టిడిపి పార్టీ సభ్యత్వంగా తీసుకున్న 100 రూపాయలు భీమా పథకం ద్వారా లభించిన 5 లక్షలరూపాయలు ఇన్సూరెన్స్ కవరేజ్ పత్రాన్ని కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంలో ఎమ్మెల్యే కోట్ల కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ,ఈ ఆర్థిక సహాయం మీ కుటుంబానికి కొంతమేర ఊరట కలిగిస్తూ,భవిష్యత్తులో ధైర్యంగా జీవించేందుకు తోడ్పడుతుంది అని తెలిపారు. పార్టీ కార్యకర్తల సంక్షేమం తమకు అత్యంత ముఖ్యమని, తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ తమ కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. ఈ నిధి టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి ద్వారా అందించ బడినదని, ఇది పార్టీ చేపట్టిన ఒక మానవీయ చర్య అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి బేతంచెర్ల మండల కన్వీనర్& శ్రీ మద్దులేటీ లక్ష్మీ నరసింహ స్వామిదేవస్థానం పాలక మండలి చైర్మెన్ ఉన్నం ఎల్ల నాగయ్య, బుక్కాపురం మాజీ సర్పంచ్ నాగరాజు,మాజీ ఎంపీటీసీ సభ్యుడు బొంబాయి జాకీర్,ఉన్నం సుధాకర్,ఎం ఆర్పిఎస్ జిల్లా నాయకులు తాలూకా రాజయ్య మాదిగ, టిడిపి నాయకులు కార్యకర్తలు బుక్కాపురం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## చౌడేశ్వరి ఆలయానికి విరాళం

**బనగానపల్లె ఆగష్టు 30నందిపత్రిక** నందవరం చౌడేశ్వరి అమ్మవారి దేవస్థానంకు కడప జిల్లా, ప్రొద్దుటూరు వాస్తవ్యులు జింక శ్రీనివాసులు వారి ధర్మపత్ని అనురాధ వారి కుటుంబ సభ్యులు ఆదివారం ఆలయ అభివృద్ధి కొరకు రూ.25,000 చందాను ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పి.వి.కుమార్ రెడ్డి ,ఆలయ కమిటీ చైర్మన్ పి.వి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఆలయ అర్చక వేదపండితులకు అందచేశారు.



# ఎస్ఐఆర్‌లో మరో కీలక దశ పూర్తి

**'స్పెషల్ క్యాంపెయిన్ డే'లకు విశేష స్పందన**

**ఆగస్టు 29 నాటికి 10,608 దరఖాస్తుల స్వీకరణ**

**అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితా ప్రచురణ**

**కర్నూలు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూలు సిటీ నందిపత్రిక** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యర్థనలు, అభ్యంతరాల స్వీకరణకు నిర్దేశించిన గడువు ఆగస్టు 30వ తేదీతో ముగిసిందని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఆదివారం నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన 'స్పెషల్ క్యాంపెయిన్ డే' కార్యక్రమాలను సి.క్యాంపు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ.. ఓటర్లకు అవసరమైన సహాయం అందించేందుకు, ఫాం 6, 6ఎ, 7, 8 ల స్వీకరణకు నిర్వహించిన ప్రత్యేక ప్రచార దినాలకు విశేష స్పందన లభించిందన్నారు. మే 19 నుంచి ఆగస్టు 29వ తేదీ వరకు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం 10,608 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఇందులో నమూనా6 ద్వారా 4,653, నమూనా6ఎ ద్వారా 108, నమూనా7 ద్వారా 94, నమూనా8 ద్వారా 5,773 దరఖాస్తులు స్వీకరించినట్లు వెల్లడించారు. కొత్త ఓటర్ల నమోదుకు నమూనా6, విదేశాల్లో నివసిస్తున్న భారతీయ ఓటర్ల నమోదుకు నమూనా6ఎ, ఓటర్ల జాబితాలో పేరు చేర్పు లేదా తొలగింపుపై అభ్యంతరాలకు నమూనా7, ఓటరు వివరాల సవరణ, నివాస మార్పు తదితర అంశాలకు నమూనా8ను వినియోగిస్తారని వివరించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా 2,434 మందికి నోటీసులు జారీ చేశామని, విచారణ నిర్వహించి, అభ్యర్థనలు, అభ్యంతరాలను బీఎల్‌వోలు స్వీకరించారని ఎన్నికల నమోదు అధికారి తెలిపారు. తదుపరి దశలో అభ్యర్థనలు, అభ్యంతరాల పరిశీలన, విచారణ, పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులో ఈ ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 3, 2026న ప్రచురించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి చేయనున్నట్లు ఈఆర్వో, కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు.



## ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ను సద్వినియోగం చేసుకోండి



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 30 నంది పత్రిక** ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ, ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆగస్ట్ 31వ తేది సోమవారం ఉదయం 10 గంటల నుండి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం, 10.30 నుండి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. పోన్ ద్వారా పిర్యాదులు చేసేవారు 0877-2227208 కి కాల్ చేసి మాట్లాడవచ్చుని, ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తిరుపతి ప్రజలకు కమిషనర్ ఎం.జయకృష్ణ, తెలియజేశారు.

## ఇంటి దొంగతనం కేసులో నలుగురు ముద్దాయిలు అరెస్టు

**25 గ్రాముల బంగారు ఆభరణాలు**

**320 గ్రాముల వెండి ఆభరణాలు స్వాదీనం...**



**కర్నూల్ సిటీ నందిపత్రిక** జూలై 06 తేదీ నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆదిత్య నగర్ , ఉల్చాల రోడ్డు నందు నివాసం ఉంటున్న జయంతి మహేశ్వర్ రెడ్డి ఇంట్లో తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న సుమారు 25 గ్రాముల బంగారు నగలు మరియు 320 గ్రాముల వెండి ఆభరణాలు దొంగతనం చేశారు.అందుబాటులో ఉన్న సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించగా అనుమానస్పదంగా ఒక స్కూటీ ని గుర్తించి, దాని గురించి ఆరా తీయగా

**ఈ దొంగతనం కేసులో** 1). ఎరుకలి గంగా ప్రసాద్ తండ్రి పేరు ఎరుకలి రామాంజనేయులు వయస్సు 38,, తాడిపత్రి టౌన్ 2). ఎరుకలి శివప్రసాద్ తండ్రి పేరు ఎరుకలి రామచంద్ర వయసు 48 తాడిపత్రి టౌన్ 3). కామ్లే కార్తిక్ తండ్రి పేరు శ్రీనివాసులు వయసు 32,, ఇందిరాగాంధీ నగర్ కర్నూల్ 4). ఎరుకలి రామాంజనేయులు తండ్రి పేరు ఎరుకలి సుంకన్న వయసు 43 పామిడి,, ప్రస్తుతం గుత్తి, అనంతపురం జిల్లాగా గుర్తించారు. సీఐ విక్రమ సింహ అధ్యక్షతన ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుల్స్ సుబ్బారాయుడు, మురళి, జీనస్, ఈశ్వర్, గోవింద్ లతో వారి కదలికల పై నిఘా ఉంచి వారిని సమ్మర్ స్టోరేజ్ పక్కన పొలాల్లో దాక్కుని ఉండగా పట్టుకొని వారిని అరెస్ట్ చేశారు...

వారి వద్ద నుండి రెండు బంగారు చైన్లు మరియు చిన్నపిల్లల ఉంగరాలు మొత్తం 2.5 తులాల బంగారు నగలు మరియు 32 తులాల వెండి, దొంగతనానికి ఉపయోగించిన స్కూటీ వాహనాన్ని వారి నుండి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు.

## బీఎస్పీ ముఖ్య నేతల సమావేశ కార్యక్రమంలో పాల్గొన్న కర్నూల్ నియోజకవర్గ ఇన్చార్జ్ గాడి అరుణ్ కుమార్



**కర్నూల్ సిటీ నంది పత్రిక** అనంతపురం పట్టణంలో బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వెస్ట్ రాయలసీమ జోన్ ముఖ్య నాయకుల జోనల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సెప్టెంబర్ 9వ తేదీన జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల సభకు సంబంధించిన జన సమీకరణపై సమగ్రంగా సమీక్షించారు.వెస్ట్ రాయలసీమ పరిధిలోని అన్ని జిల్లాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనేలా కార్యాచరణ రూపొందించారు. సెప్టెంబర్ 9న జరిగే సభకు వేలాదిగా తరలివచ్చి బీఎస్పీ సత్తాను చాటాలని బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ పిలుపునిచ్చారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి, బీఎస్పీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జోనల్ ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు, అసెంబ్లీ పార్టీ ఇన్చార్జిలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రాయలసీమ పౌర సమాజ మిత్రులతో ఇష్టాగోష్టి సమావేశం

**కర్నూలు ప్రగతి సమితి అధ్యక్షుడు శ్రీహర్ష**




**కర్నూల్ సిటీ నంది పత్రిక** ఆదివారం 30-08-2026న కర్నూలులో రాయలసీమ ప్రాంత అభివృద్ధి, సమస్యలు మరియు భవిష్యత్ కార్యాచరణపై ఇష్టాగోష్టి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి కర్నూలు ప్రగతి సమితి (కేపీయస్ ) వ్యవస్థాపక అధ్యక్షులు ఎం. శ్రీ హర్ష హాజరై, రాయలసీమ అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టులు, రైతుల సమస్యలు మరియు నీటి వనరుల అభివృద్ధిపై చర్చించారు. ప్రత్యేకంగా గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం ద్వారా కర్నూలు జిల్లాతో పాటు రాయలసీమ ప్రాంతానికి కలిగే ప్రయోజనాలు, సాగునీటి అవసరాలు మరియు రైతుల భవిష్యత్తుపై సమావేశంలో చర్చించడం జరిగింది. గుండ్రేవుల ప్రాజెక్టు సాధన కోసం రాయలసీమ అభివృద్ధి కోసం ఐక్యంగా కృషి చేద్దాం అని చెప్పారు.

## రేపు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరపాలక సంస్థలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:00 గంటలకు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి నగరపాలకకు చెందిన అన్ని విభాగాల అధికారులు హాజరు అవుతారని, కాలనీల్లోని మౌలిక వసతులు, రహదారులు, డ్రైనేజీ, వీధి వెలుగులు, పరిశుభ్రత వంటి సమస్యలను ప్రజలు లిఖిత పూర్వకంగా సమర్పించవచ్చని తెలిపారు.ప్రతి ఫిర్యాదు స్వీకరించబడిన వెంటనే సంబంధిత అధికారులకు పంపి, పరిష్కారం కోసం నిర్దిష్ట గడువులు నిర్ణయించబడతాయని ఆయన వెల్లడించారు. అదేవిధంగా, ప్రతి ఫిర్యాదు పురోగతిని పౌరులు స్వయంగా హెచ్ టీ టీ పి యస్ ://మీకోసం .ఏపీ . గవర్నమెంట్ .ఇన్ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని కమిషనర్ వివరించారు.

# కప్పట్రాళ్లలో ఘనంగా ఆకే రవికృష్ణ ఐపీఎస్, ఐజీపి జన్మదిన వేడుకలు






**కర్నూల్ సిటీ నంది పత్రిక** కప్పట్రాళ్ల గ్రామములో ఆకే రవికృష్ణ ఐపిఎస్ కప్పట్రాళ్ల గ్రామ దత్త పుత్రుడు జన్మదిన వేడుకలు గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించడం జరిగింది పుట్టినరోజు సందర్భంగా తలసేమియా బాధితుల కోసం 30 మంది కప్పట్రాళ్ల యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవనకొండ మండల సీఐ వేణుగోపాల్ పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.కప్పట్రాళ్ల గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఆకే రవికృష్ణ ఐపీఎస్, ఐజీ జన్మదిన వేడుకలను కప్పట్రాల గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీశక్తి భవనంలో పండగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కప్పట్రాల యువత గత పది సంవత్సరాలుగా తలసేమియా బాధితుల కోసం నిరంతరం రక్తదానం చేస్తూ మానవతా సేవలను కొనసాగిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం తలసేమియా బాధితులకు అవసరమైన రక్తాన్ని అందించేందుకు యువత ముందుకు వస్తున్నారు. కర్నూలు బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో సేకరించిన రక్తాన్ని తలసేమియాతో బాధపడుతున్న రోగుల అవసరాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ మాట్లాడుతూ, కప్పట్రాల గ్రామం ఇంత అద్భుతంగా అభివృద్ధి చెందడానికి ఆకే రవికృష్ణ ఐపీఎస్, ఐజీ కృషి ఎంతో ఉందన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుని విద్య, మహిళా సాధికారత, రైతుల అభివృద్ధి, యువతకు మార్గనిర్దేశం వంటి అనేక రంగాల్లో సమూల మార్పులు తీసుకొచ్చారని పేర్కొన్నారు. గ్రామం నుంచి ఇప్పటికే 8 మంది ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించగా, సుమారు 70 మంది ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు అని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి మార్గంలో నడుస్తున్నారని అన్నారు. అనంతరం కప్పట్రాల మల్లికార్జున మాట్లాడుతూ, ఆకే రవికృష్ణ ఐపీఎస్ కప్పట్రాల గ్రామాన్ని ఒక పట్టణం తరహాలో అభివృద్ధి చేశారని అన్నారు. గ్రామస్తులకు అన్నలా, తమ్ముడిలా అండగా ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. గ్రామంలో సీసీ రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్, శ్రీశక్తి భవనం, జిల్లా పరిషత్ హైస్కూల్, కళ్యాణ మండపం తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా కప్పట్రాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు.ఆకే రవికృష్ణ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, మహిళా సంఘాలను ప్రోత్సహించడంతో పాటు రైతులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఇలాంటి అభివృద్ధి చెందిన గ్రామంలో తాను జన్మించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అనంతరం ఐజీ ఆకే రవికృష్ణ తో గ్రామస్తులు వర్చువల్‌గా మాట్లాడి జన్మదిన కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. గ్రామస్తులు స్వీట్లు పంచుకుని ఆనందం వ్యక్తం చేశారు. మహిళలు, యువత, విద్యార్థులు, గ్రామ పెద్దలు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ యువకుడు గిరిబాబు అనే యువకుడు ఆకే రవికృష్ణ సేవలను వివరిస్తూ ప్రత్యేకంగా రచించిన పాటను ఐజీ జన్మదినం సందర్భంగా విడుదల చేశారు.

**ఐజీ ఆకే రవికృష్ణ సందేశం** వర్చువల్ సమావేశంలో ఐజీ ఆకే రవికృష్ణ మాట్లాడుతూ, "కప్పట్రాల గ్రామాన్ని నేను ఎప్పటికీ మరువను. గ్రామంలోని రైతులు, మహిళలు, విద్యార్థులు, యువత అందరూ బాగుండాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలి. మహిళలు మహిళా సంఘాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెంది లక్షాధికారులుగా ఎదగాలి. రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా కొనసాగించాలి" అని ఆకాంక్షించారు. త్వరలో కప్పట్రాల గ్రామానికి వచ్చి గ్రామస్తులను కలుసుకుంటానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ జ్యోతి సీఈఓ బి. నారాయణ, గ్రామ జ్యోతి అధ్యక్షురాలు భవాని, కప్పట్రాల గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు అంజనమ్మ, కప్పట్రాల మల్లికార్జున, సురేంద్ర నాయుడు,రవి, చింతామను రవికుమార్, చాకలి లక్ష్మన్న, వారం వెంకటరమణ, గొర్ల సుంకన్న, పాపన్న, విద్యపోగు సుంకన్న, సుధాకర్, జ్యోతి, సరిత తదితరులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వినాయక ఘాట్‌కు సరికొత్త శోభ

**నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు**

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలోని వినాయక ఘాట్ వద్ద చేపట్టిన ప్రత్యేక అభివృద్ధి, స్వచ్ఛత పనులతో ఘాట్‌కు సరికొత్త శోభ సంతరించుకుందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ఆదివారం వినాయక ఘాట్‌ను కమిషనర్ సందర్శించి, ఇటీవల పూర్తి చేసిన సీసీ బండ్, మెట్లు, డ్రెయిన్ నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వినాయక ఘాట్ నిమజ్జన సమయంలోనే కాకుండా నిత్యం పరిశుభ్రంగా, స్వచ్ఛంగా, ఆహ్లాదకరంగా ఉండేలా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. గత మూడు నెలల్లో జేసీబీలతో చెత్తాచెదారాన్ని తొలగించడంతో పాటు పలుమార్లు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టామన్నారు. ఘాట్ పరిసరాల పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించేందుకు ముగ్గురు సిబ్బందికి ప్రత్యేకంగా విధులు కేటాయించామని, వారు ఘాట్‌ను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కేసీ కెనాల్‌లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించారన్నారు. కేసీ కెనాల్‌లో చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు రెండు చెత్త సేకరణ ట్రాలీలను అందుబాటులో ఉంచామన్నారు. ఇటీవల కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క మొక్కలను తొలగించినట్లు పేర్కొన్నారు. ఈ చర్యల ఫలితంగా ప్రస్తుతం వినాయక ఘాట్ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా కనిపిస్తోందన్నారు. అంతేకాకుండా ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఘాట్‌ను అభివృద్ధి చేయడంలో భాగంగా సీసీ రహదారి, మెట్లు, బండ్, రాతి నిర్మాణాలు, డ్రెయిన్, ఫెన్సింగ్ వంటి పనులను చేపట్టామన్నారు. దీంతో ఘాట్ నూతన శోభను సంతరించుకుందన్నారు. త్వరలోనే ఘాట్‌కు రంగులు వేసి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఫరూక్, శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.



**బేతంచెర్ల ఆగస్టు 30 ( నందిపత్రిక ).**

ఆదివారం నాడు బేతంచెర్ల పోలీసు స్టేషన్ ఆవరణలో సిఐ.వెంకటేశ్వర రావు,రౌడీ షీటర్లకు సీరియస్ గా హెచ్చరికలు చేశారు.బేతంచెర్ల మండల పరిధిలో ఎవరైనా సరే,శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.మీలో మార్పు తెచ్చుకొని,జన జీవన స్రవంతిలో జీవనం సాగించాలని అన్నారు.రౌడీ షీటర్ అనే ముద్రను చెరిపి వేసుకొని, సమాజంలో భార్య పిల్లలతో, బంధు మిత్రులతో సుఖ సంతోషాలతో మనుగడ సాగించాలని వారికి పలు సూచనలు చేశారు కార్యక్రమం లో ఎస్ఐ.రమేష్ బాబు,ఎస్ఐలు, ఎఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# జిల్లాలో బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తాం

**బీసీ నాయకత్వానికి అండగా ఉంటాం**

**ఏఐసీసీ, పీసీసీ దృష్టికి జిల్లాలోని అంశాలు**

**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించేలా కార్యాచరణ**

**ఓబిసి నేషనల్ కోఆర్డినేటర్ రుద్ర సంతోష్**

కర్నూలు సిటీ నందిపత్రిక కర్నూలు జిల్లాలో బీసీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసి, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అత్యధిక రాజకీయ ప్రాతినిధ్యం దక్కేలా పటిష్టమైన కార్యాచరణ రూపొందించాలని నేషనల్ ఓబీసీ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ ఓబీసీ కాంగ్రెస్ సెల్ ఇన్‌చార్జ్ రుద్ర సంతోష్ పిలుపునిచ్చారు. ఆదివారం కర్నూలు నగరానికి విచ్చేసిన రుద్ర సంతోష్ ని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు అడ్వకేట్ క్రాంతి నాయుడు బోయ మరియు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, బీసీ నాయకత్వం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు.కర్నూలు జిల్లాలో బీసీ జనాభా గణనీయంగా ఉన్న నేపథ్యంలో వారికి రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని రుద్ర సంతోష్ తెలిపారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు క్రాంతి నాయుడు బోయ చేస్తున్న పార్టీ బలోపేత కార్యక్రమాలను అభినందిస్తూ, ఆయనకు అన్ని విధాలా అండగా ఉంటామని, జిల్లాలోని బీసీ నాయకత్వానికి సంబంధించిన అంశాలను ఏఐసీసీ, పీసీసీ అధ్యక్షుల దృష్టికి తీసుకెళ్లి బీసీ నాయకత్వాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా ఓబీసీ సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేసిన ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డి.వి. సాంబశివుడు, ఓబీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లికార్జున యాదవ్, ఓబీసీ మహిళా నాయకురాలు భాగ్యలక్ష్మిలను రుద్ర సంతోష్ అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీసీ వర్గాలను సమన్వయం చేసుకుని క్షేత్రస్థాయిలో ఇప్పటి నుంచే పటిష్టంగా పనిచేయాలని సూచించారు.కుల గణనపై ఉద్యమాన్ని బలోపేతం చేయాలి అని, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గారు చేస్తున్న కుల గణన, జనగణన డిమాండ్లపై రాబోయే రోజుల్లో ప్రణాళికా బద్ధంగా ప్రజల్లోకి వెళ్లి పోరాటాన్ని బలోపేతం చేయాలని రుద్ర



సంతోష్ పిలుపునిచ్చారు. దేశంలో అత్యధిక జనాభా కలిగి ఉన్నప్పటికీ సామాజిక, ఆర్థిక, రాజకీయంగా వెనుకబడిన బీసీ వర్గాలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా మరియు ప్రాతినిధ్యం దక్కే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ యన్ సి బజారన్న, ఓబీసీ జిల్లా నాయకురాలు భాగ్యలక్ష్మి మొదలగువారు పాల్గొన్నారు.

# మార్పు రావాలి -మార్పు కావాలి.

**సెప్టెంబర్ 1 న ఛలో ఢిల్లీ.**

**కేంద్రంలోని బిజెపి ప్రజా పాలనను నిర సించండి.**

**కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై -సిపిఐ పోరుబాట.**




బేతంచెర్ల ఆగస్టు 30 ( నందిపత్రిక ). కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా పాలనను నిరసించండని,దేశ వ్యాపితంగా ధరలను తక్షణమే అరికట్టాలని,సార్వత్రిక విద్య, ఆరోగ్యంను అందు బాటులోకి తేవాలని, పంటలకు కనీస మద్దతు ధర -చట్ట భద్ధత కల్పించాలని,బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలను పునరుద్దరించాలని, ప్రజా స్వామ్యాన్ని పరి రక్షించాలని, ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించాలని,మహిళా రిజర్వేషన్ ను తక్షణమే అమలు చేయాలని, కార్మికుల హక్కులను పరి రక్షించాలని దళిత,ఆది వాసీలపై అకృత్యాలను,దాడులను నిలిపివేయాలన్న డిమాండ్లపై, సిపిఐ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా,ఆదివారం సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో, సిపిఐ బేతంచెర్ల మండల సమితి కార్యదర్శి ఎన్నా భార్గవ్ మాట్లాడుతూ,సెప్టెంబర్ 1వతేది ఛలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు

# పని ఎంతో.... వేతనం అంతే

**-కొలతల ప్రకారం వేతనం వర్తిస్తుంది**

**-మస్టర్ నిర్వహణలో తప్పులు దొర్లకుండా చూసుకోవాలి - ఏపీవో విమలమ్మ**



కొత్తపల్లి – నంది పత్రిక: సిబ్బంది ఇచ్చిన కొలతలు తీస్తేనే సరైన వేతనం పడుతుందని లేకపోతే పని ఎంత చేస్తారో అంతే వేతనం వస్తుంది ఏపీఓ విమలమ్మ వేతనదారులకు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీ లోని మజారా గ్రామమైన పాలెంచెరువు వద్ద సర్వారెడ్డి చెరువలో వీబీజీ రాంజీ పనులను తనిఖీ చేశారు. ముందుగా మస్టర్ నిర్వహణను, హాజరును తనిఖీ చేశారు. అదేవిధంగా ఇచ్చిన కొలతల మేరకు పనులు చేస్తున్నారా లేదా అని, వేతనదారులు చేసిన కొలతలకు ఎంతమేరకు వేతనం వర్తిస్తుందని అక్కడే టెక్నికల్ అసిస్టెంట్ మజహాజర్తో కొలతలు వేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వీబీజీ రాంజీ పథకంలో ఎంతమేరకు పనులు చేస్తారో అంతే వేతనం వర్తిస్తుందన్నారు. అదేవిధంగా మేటిలు మస్టర్ నిర్వహణలో తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. సిబ్బంది ఇచ్చిన కొలతలు తీస్తేనే పూర్తివేతనం వర్తిస్తుందన్నారు. ఆమెవెంట ఫీల్డ్ అసిస్టెంట్ కళ్యాణ్ కుమార్ ఉన్నారు.

# పేద రోగుల కోసమే ఉచిత వైద్య శిబిరాలు..





**పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ సభ్యుడు పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి**

**విజయవంతంగా 71వ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి మెగా వైద్య శిబిరం..**

నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 30 ( నంది పత్రిక ) పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్, గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి అన్నారు. చైర్మన్ డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ సొసైటి ఆధ్వర్యంలో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో నిర్వహించిన 71వ మెగా వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. కోవెలకుంట్ల తాలూకా సంజామల మండలం మంగపల్లె గ్రామంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరోగ్యాన్ని అందించేందుకే పెద్దరెడ్డి తిమ్మారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తనకు జన్మనిచ్చిన ఊరికి సేవ చేయాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. పేద ప్రజలకు డాక్టర్ పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి సేవలు అభినందనీయమనీ అన్నారు. ఇందులో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్మించి మెగా వైద్య శిబిరాలు నిర్వహించి పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందిస్తున్నారని అన్నారు. ప్రతినెల చివరి ఆదివారం రోజున పేదలకు వైద్య శిబిరంతో పాటు ఉచితంగా మందులు అందిస్తూ తల్లిదండ్రుల రుణం తీర్చుకుంటున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొనే ప్రతి ఒక్కరికి తమ సొంత ఖర్చులతో ఉచితంగా భోజన వసతిని కల్పిస్తూ మంగపల్లె గ్రామంలోని ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని ఆయన చేస్తున్న సేవలే మాకు శ్రీరామరక్ష అన్నారు. 71వ మెగా వైద్య శిబిరంలో 1500 మంది రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డైరెక్టర్, షేక్షావలి రెడ్డి వెల్లడించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బిపి, షుగరు , మోకాళ్ళ నొప్పులు, కంటివ్యాదులు, ఊపిరితిత్తుల వ్యాధులు, స్త్రీలకు సంబందించిన వ్యాదులు, చెవి , ముక్కు , గొంతుకు సంబందించిన జబ్బులకు , దంతవ్యాదులు, చర్మవ్యాదులకు వైద్యసేవలు చేసి మందులను ఇస్తున్నామని తెలియజేశారు. కోవెలకుంట్ల సంజామల మండలం పరిసర ప్రాంతం ప్రజలందరూ శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు చేసుకున్నారు.





# రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ

**నంద్యాల జిల్లా నుంచి 10 మందికి లబ్ధి--**

నంద్యాల బ్యూరో, ఆగస్టు 30(నంది పత్రిక):– ఆంధ్రప్రదేశ్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రోటరీ రెడ్‌క్రాస్ సంయుక్త నిర్వహణలో అనంతపురంలో నిర్వహించిన ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ శిబిరం విజయవంతమైంది. నంద్యాల జిల్లా నుంచి సుమారు 15 మంది లబ్ధిదారులను శిబిరానికి తీసుకెళ్లగా, అర్హులైన 10 మందికి ఒక్కొక్కటి సుమారు రూ.30 వేల విలువైన కృత్రిమ చేతులను ఉచితంగా అందజేశారు. మోచేతి కింది భాగంలో ఐదు నుంచి పది అంగుళాల కండ ఉన్న వారికి వీటిని అమర్చనున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల తెలిపారు. వీటితో సుమారు ఐదు కిలోల వరకు బరువు ఎత్తడంతో పాటు చిన్నచిన్న పనులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నంద్యాల రెడ్‌క్రాస్ డీఎఫ్ఓ అబ్దుల్లా ఆధ్వర్యంలో లబ్ధిదారులను అనంతపురం తరలించారు. కార్యక్రమానికి సహకరించిన గురురాజా పాఠశాల యాజమాన్యానికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# జూలేపల్లెలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు ఘనంగా భూమిపూజ





**శంకుస్థాపన చేసిన రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**

**గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్యమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత: మంత్రి ఫరూక్**

**వైద్య సదుపాయాలు గ్రామస్థుల ముంగిట్లోనే లభిస్తాయని వెల్లడి**

నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 30 ( నంది పత్రిక ) గ్రామీణ ప్రజలకు ప్రాథమిక స్థాయిలో మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు . ఆదివారం గోస్పాడు మండల పరిధిలోని జూలేపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విలేజ్ హెల్త్ క్లినిక్' భవన నిర్మాణ పనులకు మంత్రివర్యులు ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరై శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్నచిన్న వ్యాధులకు, ప్రాథమిక పరీక్షలకు పట్టణాలకు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా స్వగ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కేంద్రం పూర్తయితే గ్రామ ప్రజలకు అవసరమైన ప్రాథమిక చికిత్సలు, మందులు, గర్భిణులకు పరీక్షలు, అత్యవసర ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను వెచ్చిస్తూ ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఫరూక్ తెలిపారు ఈ కార్యక్రమంలో దీబగుంట్ల సొసైటీ చైర్మన్ నలిపెల ఓబులరెడ్డి , కన్వీనర్ తులసీశ్వర్ రెడ్డి, నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాజ్ , సుబ్బయ్య మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, కూటమి నాయకులు, జూలేపల్లె గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ

**ఏడు మందికి 56 వేల వ్యయంతో మూడు చక్రాల సైకిళ్ల పంపిణీ**

**ఎస్బిఐ అసిస్టెంట్ మేనేజర్, విజువల్లీ చాలెంజ్డ్ పుల్లయ్య సౌజన్యంతో**

**దివ్యాంగుల సంక్షేమ సంఘం తరపున పుల్లయ్యను ఘనంగా సత్కరించిన డాక్టర్ రవి కృష్ణ ,ఎం.పీ.వి. రమణయ్య**



నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 30 ( నంది పత్రిక ) ఆదివారం నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో, సంఘం అధ్యక్షులు ఎం.పీ.వి. రమణయ్య అధ్యక్షతన జరిగిన సేవా కార్యక్రమంలో, సంఘం గౌరవ అధ్యక్షులు, అంతర్జాతీయ లయన్స్ క్లబ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్ గా పనిచేస్తున్న పుల్లయ్య సౌజన్యంతో ఏడు మంది దివ్యాంగులకు 56 వేల రూపాయలతో కొనుగోలు చేసిన మూడు చక్రాల సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, రమణయ్య మాట్లాడుతూ పుల్లయ్య అంధత్వాన్ని అధిగమించి ఆత్మవిశ్వాసంతో స్టేట్ బ్యాంకులో ఉద్యోగం సాధించడమే కాకుండా తిరిగి దివ్యాంగులకు సహకరించాలని ముందుకు వచ్చి 56 వేలు విరాళంగా అందజేయడం అభినందనీయమన్నారు. నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం దివ్యాంగుల సంక్షేమానికి కృషిని నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. వారికి అవసరమైన ఉపకరణాలు అందజేయడం, ప్రతినెల అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేయడం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పుల్లయ్యను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ,రమణయ్య లతో పాటు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సందీప్, దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి రామలింగం, ఉపాధ్యక్షులు వెంకటరావు, కార్యవర్గ సభ్యుడు మురళీధర్, సంఘం కార్యాలయ కార్యదర్శి ఆలా మధు, సలహాదారు శివరామిరెడ్డి,లబ్ధిదారుల బంధువులు పాల్గొన్నారు.



## కర్నూలుకు శాశ్వత హైకోర్టు బెంచ్ ఇవ్వాలి

### జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యమ్ సుమలత



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలుకు శాశ్వత హైకోర్టు బెంచ్ ఇవ్వాలనీ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మీసాల సుమలత డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సుమలత మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదటి రాజధాని కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన మాట నెరవేర్చాలని సుమలత కోరారు. కర్నూలు లో శాసన రాజధాని, కార్యనిర్వాహక రాజధాని న్యాయ రాజధాని, పరిపాలన రాజధాని మూడు రాజధానులు 1953 నుంచి 1956 వరకు మూడేళ్ళుగా కర్నూల్ లోనే ఉన్నాయని, ఆ తర్వాత తెలంగాణలోని హైదరాబాదులో పెట్టారని,2014 సంవత్సరంలో మూడు రాజధానులు ఒకే చోట పెట్టడం జరిగిందన్నారు. కర్నూల్ నుంచి పోగొట్టుకున్న మూడు రాజధానిలో కనీసం హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని మీసాల సుమలత డిమాండ్ చేశారు. 30వ తేదీ ఆదివారం రోజున రాయలసీమ న్యాయవాదుల జేఏసీ న్యాయశాఖ మంత్రి ఫరూక్ ను కలిసేందుకు వచ్చారని ఉదయం నుంచి సాయంకాలం వరకు అనుమతి ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు. ఆగస్టు 2వ తేదీ జరిగే క్యాబినెట్ సమావే క్యాబినెట్ సమావేశంలో కర్నూలు లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వకపోతే జిల్లా అధ్యక్షులు బోయ క్రాంతి నాయుడు ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేస్తామని మీసాల సుమలత హెచ్చరించారు.

## ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

## డీఎస్పీ బి.శ్రీనివాసులు



**మహానంది ఆగస్టు 30 (నంది పత్రిక):–** మహానంది మండలం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థి,ప్రస్తుతం విజయవాడలో డీఎస్పీగా విధులను నిర్వహిస్తున్న బి. శ్రీనివాసులు వారి మిత్రబృందంతో కలిసి ఆదివారం సాయంత్రం మొక్కలు నాటారు. చదువుకున్న పాఠశాల పట్ల తమకున్న అభిమానాన్ని, సమాజ శ్రేయస్సు పట్ల బాధ్యతను చాటుకుంటూ వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ బి. శ్రీనివాసులు మాట్లాడుతూ…“తాము చదువుకున్న పాఠశాలకు తిరిగి రావడం, ఇక్కడ ఒక మొక్కను నాటడం ఎంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చిందన్నారు. ప్రతీ విద్యార్థి పర్యావరణ పరిరక్షణను తమ బాధ్యతగా స్వీకరించాలన్నారు. ప్రతీ ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని సంరక్షించాలి“ అని పిలుపునిచ్చారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేసిన డీఎస్పీ బి. శ్రీనివాసులు మరియు వారి మిత్రబృందాన్ని పాఠశాల యాజమాన్యం,గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు దేవనాల శ్రీనివాసులు,కళ్లె మద్దిలేటి,గజేంద్రుడు, సీఆర్పి చిన్న తిమ్మయ్య మరియు పూర్వ విద్యార్థులు తిమ్మయ్య,కుంపటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్, బీడిఎస్ ఫీజులు పెంపు

## పేద విద్యార్థులకు భారం

### రెండున్నర ఏళ్లు గడిచిన ఒక్క మెడికల్ కాలేజీ ని కూడా పూర్తి చేయలేని కూటమి ప్రభుత్వం.. పిపిపి పేరుతో కాలక్షేపం

### విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి. భరత్ కుమార్



**నంది పత్రిక కర్నూలు బ్యూరో :** కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి రెండున్నరసంవత్సరాలు కావస్తున్న ఇంత వరకు ఒక్క మెడికల్ కళాశాల కూడా ఏర్పాటు చేయకుండా అదనంగా వీదీదూ,దీణా ఫీజులు పెంచడం పేద విద్యార్థుల వైద్య విద్య కు గొడ్డలి పెట్టు వేయడమే అని బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు వి. భరత్ కుమార్ గారు ఆదివారం ఒక ప్రకటన లో ఆవేదన వ్యక్తం చేశారు, మెడికల్ కళాశాలల నిర్మాణాన్ని కొనసాగించకుండా పీపీపీ పేరుతో కాలయాపన చేస్తూ కూటమి ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక నిర్ణయాలను తీసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు, మొన్న మెడికల్ అడ్మిషన్లు కు సంబంధించి రిజర్వేషన్ విద్యార్థులకు అన్యాయం చేస్తూ జీవో నెంబర్ 102 ను తీసుకొచ్చిందని నేడు విద్యార్థులకు భారం అయ్యే విధంగా ఏ, బి, సి కేటగిరీలో చదివే విద్యార్థులకు ఫీజులు పెంచడం దారుణం అని ఆవేదన వ్యకం చేశారు, పెంచాల్సింది ఫీజులు కాదని వీదీదూ సీట్లు తెలిపారు, కూటమి ప్రభుత్వం పూర్తిగా విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం అని ఆవేదన వ్యక్తం చేశారు, ఎన్నికల ముందు చెప్పింది ఒకటి గెలిచాక చేసింది ఒకటి అని ఎద్దేవ చేశారు, కోర్టు ఆదేశాలు జారీ కాకముందే ఫీజులు పెంచడం విడ్డూరం అని ఆవేదన వ్యక్తం చేశారు, పెరిగిన ధరలకు అనుగుణంగా జూనియర్ డాక్టర్ ల స్టైఫశీడ్ పెంచాలని డిమాండ్ చేసారు.

## కలసపాడు ఎస్పీజీ చర్చికి కార్మిక శాఖ సూపరింటెండెంట్ జ్యోతి కుమారి సందర్శన

**కలసపాడు, ఆగస్టు 30 (నంది పత్రిక)** మండల కేంద్రమైన కలసపాడులో సగిలేరు నది ఒడ్డున ఉన్న ఎస్పీజీ పరిశుద్ధ పేతురుపరిశుద్ధ పౌలు దేవాలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ సూపరింటెండెంట్ ఎరమల జ్యోతి కుమారి సందర్శించారు. ఈ సందర్భంగా దేవాలయ విశిష్టత, చారిత్రక నేపథ్యం గురించి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం దేవాలయ గురువులు రెవరెండ్ ఆశిష్ గాబ్రియేల్, రెవరెండ్ అక్కిదాసరి జాన్సన్ విజయ్ కుమార్, కమిటీ సభ్యులు బత్తుల కిషోర్, పెద్దిటీ సైమన్, కలసపాటి రత్నరాజు, ఉపాధ్యాయుడు కారు జె. ప్రవీణ్ కుమార్ (చిన్ను) తదితరులు జ్యోతి కుమారిని ఘనంగా సన్మానించారు.



# అధికారుల నిర్లక్ష్యం... రైతులకు శాపం

### - మళ్ళీ ఎత్తిపోతల పైప్ లైను లీకేజీ
### - వృథా అవుతున్న సాగునీరు
### - అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న రైతన్నలు



**కొత్తపల్లి - నంది పత్రిక :** అటు ఎత్తిపోతల, ఇటు జాతీయ రహదారి నిర్మాణ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. అసలే ఎల్నినో ప్రభావంతో వర్షాలు లేకుండా పోయాయి. మండలంలోని ముసలిమడుగు సమీపంలో ఉన్న సంగమేశ్వరం-శివపురం ఎత్తిపోతల పథకాల నుంచి నాలుగు రోజుల నుంచి సాగు నీరు విడుదల చేసి మొక్కజొన్న, ఇతర పంటలను కాపాడాలని అధికారులు తలంచి నీటి విడుదల చేశారు. అయితే ఆదివారం సాయంత్రం మండలంలోని సింగరాజు పల్లె గ్రామ సమీపంలో జాతీయ రహదారి 167 కె నిర్మాణంలో లోపంతో ఎత్తిపోతల పైప్లాన్ లీకేజీకి పడింది. మొన్నటికి మొక్క పైడ్లైన్ ఎయిర్ వాల్ బ్లాస్ట్- ఆయి ఎత్తిపోతల నీరు వృథాగా పోయింది. మళ్ళీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎత్తిపోతల పైడ్లైను రహదారిలో ఓ బ్రిడ్జి క్రింద పైడ్లైన్ లీకేజి ఏర్పడింది. సాగు నీరు వృథాగా పారిపోతుంది. అసలే కరువు కాలం దానికి తోడు అధికారుల ముందుచూపు లేని తనానికి నిదర్శనంగా నిలుస్తుంది ఈ ఘటన సాగునీరు కాస్తా వృథాగా పోతుండడంతో అధికారుల తప్పిదమే దీనికి కారణమని రైతులు వాపోతున్నారు. బ్రిడ్జి క్రింద పైప్లాన్ బాగాలేదు అని చెప్పినా కూడా అటు రహదారి నిర్మాణ అధికారులు, ఇటు ఎత్తిపోతల అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. అసలే పంటకు నీరు లేదు అనుకుంటుంటే ఇలా నీరు వృథాగా పోతున్న పట్టించుకొనే దిక్కులేకుండా పోయిందని రైతన్నలు వాపోతున్నారు. ఇరు శాఖల అధికారులు త్వరగా స్పందించి పైప్లాన్కు మరమ్మత్తులు చేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

## శతాధిక కవి సమ్మేళనంలో అలరించిన నంద్యాల కవులు



**కర్నూలు ప్రతినిధి. ఆగస్ట్ 30 . (నంది పత్రిక ):** తెలుగు భాషా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కర్నూలులోని టి.జి.వి. కళాక్షేత్రంలో ఆదివారం నాడు ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి ‘శతాధిక కవి సమ్మేళనం‘ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల పట్టణానికి చెందిన కవులు తమ కవితా గానంతో సభను విశేషంగా ఆకట్టుకున్నారు. నంద్యాలకు చెందిన ప్రముఖ కవులు టి.వి. సురేష్ బాబు, కొప్పుల ప్రసాద్, నాగ కుమార్, ఎం.ఎన్.డి. రఫీ, చిలకల బాలరాజు, మరియు రత్నలక్ష్మి ఈ శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొని మాతృభాషా విశిష్టత, తీపిదనం మరియు సాహితీ వికాసంపై స్వీయ కవితలను చదివి ఆహుతులను అలరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, టి.జి.వి. కళాక్షేత్ర చైర్మన్ టి.జి. వెంకటేష్, కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారి సుధాకర్, ప్రముఖులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియా ముఖ్య అతిథులుగా హాజరై కవులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. తెలుగు భాషా రక్షణకు, సాహిత్య పోషణకు కవులు చేస్తున్న కృషి అభినందనీయమని అతిథులు కొనియాడారు. జిల్లా స్థాయిలో నంద్యాల ఖ్యాతిని చాటిచెప్పిన కవులను నంద్యాల పుర ప్రముఖులు, సాహితీవేత్తలు మరియు అభిమానులు హృదయపూర్వకంగా అభినందించారు.

## ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు దావూద్ బాషా తండ్రి గారిని పరామర్శించిన శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి గారు



రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు దావూద్ బాషా గారి తండ్రి గారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలుసుకున్న టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీ రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డి గారు వారి నివాసానికి వెళ్ళి నేరుగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన దావూద్ బాషా గారి తండ్రి గారి ఆరోగ్యం గురించి, అందిస్తున్న వైద్య చికిత్సల వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెబుతూ, త్వరలోనే ఆయన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి..

### ఘటనా స్థలానికి చేరుకున్న నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

**కర్నూలు సిటీ నందిపత్రిక** ఓర్వకల్లు మండలం మీదివేముల గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది మీదివేములనన్నూర్ గ్రామాల మధ్యలోని నిమ్మకాయ తోటలో వైఎస్ఆర్సిపి కార్యకర్త పిన్నపురం బోయ వెంకటేశ్వర్లు (తండ్రి: మద్దిలేటి) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఘటనకుసంబంధించినపూర్తివివరాలనుతెలుసుకుని, మృతికి గల కారణాలను సమగ్రంగా దర్యాప్తు చేసి నిజానిజాలను వెలికితీయాలని పోలీసు అధికారులను కోరారు.





## మాల మహానాడు మహిళా నూతన కమిటీ ఎన్నిక




**బనగానపల్లె ఆగష్టు 30 నందిపత్రిక** బనగానపల్లె పట్టణానికి సంబంధించి మాలమహానాడు మహిళా నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి తెలిపారు. మాల ఉద్యోగస్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ బాబు ఆదేశాల మేరకు ఆదివారం కమిటీ సమావేశం లో వారిని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా మహిళా ఉపాధ్యక్షు రాలిగా దొర్నిపాడు మండలం గోవిందిన్నే గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి, అవుకు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన శ్రీరాముల శ్రీదేవిని బనగానపల్లె నియోజకవర్గం అధ్యక్షరాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతనముగా ఎన్నుకోబడిన వెంకటలక్ష్మి, శ్రీదేవి మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో మాలల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని మాలల హక్కులకై చురుకైన పాత్ర పోషిస్తామని అన్నారు. మమ్ములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మాల ఉద్యోగస్తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ బాబుకు మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్షులు బి మద్దిలేటి మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మారం నాగరాజు నియోజకవర్గ అధ్యక్షులు డి నాగేంద్రబాబు జిల్లా కార్యదర్శి కే శివుడు అంబాపురం వెంకటేశ్వర్లు తదితర మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు

## ఆరోగ్యమే మహా బాగ్యం... చిన్నతనం నుండే విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి.

### కమిషనర్ ఎం. జయకృష్ణ.



**తిరుపతి బ్యూరో చీఫ్ ఆగస్టు 30 నంది పత్రిక** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చునని, చిన్నతనం నుండే విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ, అవగాహన పెంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియం లో రెండు రోజులపాటు “ప్రివెంటివ్ హెల్త్ కేర్ అండ్ డిజిటల్ వెల్‌నెస్“ అంశంపై అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ముగింపు కార్యక్రమంలో కమిషనర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయుష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నేచురోపతి ద్వారా వ్యాధులను నివారించడం, డిజిటల్ యుగంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడంపై నిపుణులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా “ఆరోగ్యమే మహాభాగ్యం“ అని తెలిపారు. నేటి యువత మొబైల్, ల్యాప్‌టాప్ లకు అతుక్కుపోయి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారని, దీనిని నివారించేందుకు యోగా, ప్రకృతి వైద్యం, సరైన జీవనశైలి ఎంతో అవసరమని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాకరమైన జీవితం ప్రతి ఒక్కరికీ అందించాలనే సదుద్దేశ్యంతో ఇటువంటి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. రెండు రోజులపాటు తిరుపతిలో సత్యనారాయణ రాజు నిర్వహించడం మనందరికీ ఎంతో ఆనందకరమని తెలిపారు. విద్యతో పాటు చిన్నతనం నుండి ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని తెలిపారు. ఆరోగ్యంగా ఉంటేనే యువ భారత్ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి ఆరోగ్యాకరమైన సందేశాన్ని ఇంటింటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ అధికారులు, వైద్యులు, విద్యార్థులు, పాల్గొన్నారు.




## యాగంటి దేవస్థానమునకు విరాళం



**బనగానపల్లె ఆగష్టు 30నందిపత్రిక** యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానంకు హైదరాబాద్ వాస్తవ్యులు శ్రీ లలిత చంద్రకాంత్ కనకదుర్గ దంపతులు రూ.10,116, హైదరాబాద్ కె చెందిన విజయరాం రూ. 10,116 దేవస్థానం కు విరాళములను ఆలయ ఈఓ పాండురంగా రెడ్డి మరియు చైర్మన్ బండి మౌలీశ్వర రెడ్డి కి ఆదివారం అందజేశారు. అనంతరం దాతలకు కు ప్రత్యేక పూజలు జరిపించి వారికి తీర్థప్రసాదాలు అందజేయడం జరిగినది.

## 20 మద్యం బాటిల్లు స్వాదీనం

### -వ్యక్తిపై కేసు నమోదు - ఎస్ ఐ జయశేఖర్



**కొత్తపల్లి - నంది పత్రిక:** అక్రమంగా మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తి వద్ద నుంచి 20 మద్యం క్వాటర్ బాటీల్లు స్వాదీనం చేసుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జయశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని ముసలిమడుగు గ్రామంలో కార్డెన్ సర్చ్(అనుమానితుల ఇళ్ళలో సోదాలు) నిర్వహించారు. ముందుగా అనుమానితుల ఇళ్ళలను సోదా చేశారు. అందులో భాగంగానే గ్రామానికి చెందిన మండ్ల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అక్రమంగా మద్యం బాటిల్లు నిల్వ ఉంచి అమ్ముతున్నాడు. అతని వద్ద నుంచి 20 మద్యం బాటిల్లు స్వాదీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై సైబర్ నేరాలు, ఓటీపీ ఫ్రాడ్స్, ఆన్లైన్ మోసాలు, మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలు, దొంగతనాలు, అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రాంనాయక్, సిబ్బంది ఉన్నారు.



# 98 జీవో బాధితులకు అన్యాయం జరుగుతే అంతా తానై ఉద్యమిస్తా






**మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి. శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగులకు జీవో 98 ప్రకారం ఇంటికి ఒక ఉద్యోగం కల్పించాలి. ఉద్యోగాలు కల్పించకపోతే వాళ్ల చేపట్టే ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తాం. ఉద్యోగాలు వచ్చేంతవరకు తన సహాయ సహకారాలు అందిస్తా.. మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకట స్వామి**

**నందికొట్కూరు ఆగష్టు 30(నంది పత్రిక )** శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, నంద్యాల పార్లమెంట్ ఎంపీ బైరెడ్డి శబరి చొరవ చూపాలని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి డిమాండ్ చేశారు.ఆదివారం శ్రీశైలం నీటి ముంపు నిర్వాసితుల 158 రిలే శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి సందర్శించి ర్యాలీగా బయల్దేరి నిరుద్యోగులతో పాటు, ప్రజా సంఘాల నాయకులు కలిసి పొట్టి శ్రీరాములు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, పటేల్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు అనంతరం జై కిసాన్ పార్కు లో ఆత్మీయ సమ్మేళనం గుంపుల వెంకటేశ్వర్లు, జయన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి మాట్లాడుతూ శ్రీశైలం నీటిముంపు నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నీటిమొంపు నిరుద్యోగ సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకలు, పలు ఆందోళన కార్యక్రమాలు పాతిక సంవత్సరాలు చేయడం జరిగిందన్నారు. అయినా రాకపోవడంతో ఆ సంఘం నాయకులు గుంపుల వెంకటేశ్వర్లు, బాలచంద్రుడు, చెన్నకేశవులు, శాతన కోట వెంకటేశ్వర్లు,సభ్యులు తను కలవడంతో స్పందించి జీవోను మాడిపై చేసి అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నాటి సీఎం రోశయ్య దృష్టికి తీసుకువెళ్లడంతో అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.కుటుంబాల్లో చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నాటి ఎన్టీ రామారావు5 -04- 1986లో జీవో 98 ప్రకారం ఇంటికి 1 ఉద్యోగం కల్పించాలని జీవో జారీ చేయడం జరిగింది. ఆ జీవో ప్రకారం 965 మందికి నాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి నందికొట్కూరు మార్కెట్ యార్డ్ లో తన అధ్యక్షతన 513 ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం జరిగిందన్నారు.965 మందికి ఆర్థిక శాఖ అనుమతితో అంచలంచలుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ సీనియార్టీ ప్రకారం అర్హత కలిగిన వారికి జూనియర్ అసిస్టెంట్లుగా, వాచ్మెన్లుగా, ఉద్యోగ అవకాశాలు అయితే ఇంకా 674 మందికి జీవో 98 ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నందికొట్కూరు పట్టణంలోని 158 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపట్టిన ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. నీటి ముంపు నిరుద్యోగులు గొంతమ్మ కోరికలు కోరడం లేదని న్యాయంగా జీవో 98 ప్రకారం ఇంటికి ఒక ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారే తప్ప వారికి మరియు ఏ ఉద్దేశం లేదన్నారు. జీవో జారీ చేసి 40 సంవత్సరాలు అయినప్పటికీ 98 జీవో ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఎంతైనా ఉందన్నారు. నిరుద్యోగులు చేపట్టబోయే ఏ ఆందోళన కార్యక్రమాలైనా సంపూర్ణ సహకారం అందించేంతవరకు వారికి అండగా ఉంటారని బైరెడ్డి కుటుంబానికి ఇంత రాజకీయ చరిత్ర ఉందని బైరెడ్డి శేషశనారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో లోకాదలత్ ద్వారా ప్రధానమంత్రి పీవీ నరసింహారావు చెక్కులు అందజేశారని బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి కి ఎంతో అవగాహన ఉందని నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి ఎంతో ప్రతిభావంతురాలని నంద్యాల పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించిన గతంలో ఎంపీలు పెండేకంటి వెంకటసుబ్బయ్య సమస్యల పైన స్పందించే వారిని మిగతావారు పల్లెతే మాట కూడా మాట్లాడలేదని బైరెడ్డి శబరి పార్లమెంటులో అన్ని సమస్యల మీద గళమెత్తుతుందని 98 జీవో ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని, సమస్యను పరిష్కరించాలని కోరారు. నీటిమొంపు నిరుద్యోగుల అధ్యక్షుడు జయన్న, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాం మూర్తి, రాష్ట్ర నాయకులు రమేష్ బాబు, సిపిఐ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ అధ్యక్షులు పిక్కిలి వెంకటేశ్వర్లు, న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు నరసింహులు, ముస్లిం మైనార్టీ నాయకులు దౌలత్ బాషా,రామిరెడ్డి, బాలరాజు,ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజీద్, ప్రగతిశీల మహిళా కార్యదర్శి బేబీ, అధ్యక్షురాలు లక్ష్మీదేవి, పాల్గొన్నారు.



## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహణ



**నంద్యాల, ఆగస్టు, 30(నంది పత్రిక):-** జిల్లా ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి, ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించాలనే లక్ష్యంతో నేడు (సోమవారం) జిల్లా వ్యాప్తంగా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఒకేసారి నిర్వహించబడుతుందని తెలిపారు. ఉదయం 10.00 గంటల నుంచి ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను నేరుగా కార్యక్రమంలో సమర్పించవచ్చని, అలాగే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. సమర్పించిన అర్జీల పరిష్కార స్థితిని అదే వెబ్‌సైట్‌లో లేదా టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా తెలుసుకోవచ్చని వివరించారు. అర్జీదారులు తమ సమస్యలకు సంబంధించిన వినతులను ముందుగా మండల, రెవెన్యూ డివిజన్ లేదా మున్సిపల్ స్థాయి కార్యాలయాల్లో సమర్పించి, అక్కడ పరిష్కారం కాని అంశాలను మాత్రమే జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరై ప్రజల వినతులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## పీవీ రావు సతీమణి తో దస్తగిరి భేటీ



**నంద్యాల బ్యూరో, ఆగష్టు30(నంది పత్రిక):-** మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు కీర్తిశేషులు పివి రావు సతీమణి ప్రమీలదేవి, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పండు అశోక్ బాబు లను ఆదివారం నంద్యాల పట్టణంలో మర్యాదపూర్వకంగా భేటీ అయినట్లు మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రమీల దేవి దృష్టికి ఎస్సీ వర్గీకరణ దళిత క్రైస్తవ ఎస్ సి హోదా, మాలల ఐక్యత గురించి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రమీల దేవి మాట్లాడుతూ తన భర్త పీవీ రావు ఐఏఎస్ క్యాడర్ కలిగి ఉండి మాల ఉద్యమం కోసం రాజీనామా చేశారని, 1997లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైదరాబాదు నగరంలో ఐదు లక్షల మందితో అసెంబ్లీని ముట్టడించారని ఆ ముట్టడిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లాఠీ చార్జీ, గుర్రాలతో తొక్కించడం చేస్తే అప్పుడు అమరులైన గోపుతోటి నారాయణ, పోనంగి శేషయ్య చనిపోయారని తన భర్త పీవీ రావు గాయాలతో బయటపడ్డారని ఆమె గుర్తు చేసుకున్నారు. 2004లో సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణ సాధించిన తర్వాత మాలల కోసం ప్రాణాలు సైతం అర్పించాడనే ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ చెన్నమ్మ, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ధర్మవరంలో జరగబోయే రోటరీ క్లబ్ కార్యక్రమాన్ని జయప్రదం చేద్దాం

**దేవిశెట్టి హరీష్ బాబు - పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి**



**ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 30 నంది పత్రిక** రేపు నెల సెప్టెంబర్ ధర్మవరంలో జరగబోయే రోటరీ క్లబ్ సమావేశాన్ని జయప్రదం చేద్దామని రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ దేవిశెట్టి హరీష్ బాబు ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆదివారం నాడు పట్టణంలోని రోటరీ క్లబ్బు సమావేశ మందిరంలో సాధారణ సమావేశం జరిగింది.సమావేశానికి అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి సెక్రెటరీ గాండ్ల చంద్రసేన అధ్యక్షతన జరిగింది. ముందుగా ఆనవాయితి ప్రకారం రోటరీ క్లబ్ ప్రార్థనతో మౌనం పాటించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పిచ్చల మల్లేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాలను గురించి మాట్లాడుతూ రోటరీ క్లబ్ పెద్దలందరి సహకారంతో సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. దేవిశెట్టి హరీష్ బాబు మాట్లాడుతూ ధర్మవరంలో జరగబోయే కార్యక్రమానికి ఆళ్లగడ్డ రోటరీ క్లబ్ నుండి ఒకరోజు ముందుగానే సమావేశాలకు వెళ్లాలని అక్కడ జరగబోయే కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. అలాగే రోటరీ సంబంధించిన కార్యక్రమాలను తదితర అంశాలను క్షుణ్ణంగా తెలిపారు. అనంతరం రోటరీ క్లబ్ సీనియర్లు రిటైర్డ్ ప్రిన్సిపాల్ శంకర్ రెడ్డి చార్టెడ్ ప్రెసిడెంట్ పాపి రెడ్డి కేవీ సుబ్బారెడ్డి బ్యాంకు బాలిరెడ్డి రోటికి క్లబ్ కి సంబంధించి పలు అమూల్యమైన సలహాలను సూచనలను వారు తెలిపారు. రోటరీ క్లబ్ లక్కీ డ్రా లో మొదటి బహుమతి ఎమ్మెస్ నారాయణ రెడ్డి రెండవ బహుమతి సిద్ధం రెడ్డి వెంకట్రాం రెడ్డికి పాస్ట్ ప్రెసిడెంట్ టీఎస్ సత్యనారాయణ బహుమతులను విజేతలకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సురేష్ మాటీవీ,ప్రసాద్ ,బండారు దస్తగిరి ఎస్ చంద్రశేఖర్ రెడ్డి ,నిచ్చెనమిట్ల రామయ్య పాల్గొన్నారు.



## శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ పునః నిర్మాణ భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు...





**కొత్తపేట బ్యూరో చీఫ్ ఆగష్టు 30 నంది పత్రిక** రావులపాలెం మారుతీ నగర్ లో వేంచేసి ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయ పునర్నిర్మాణానికి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. రూ.80 లక్షల సిజిఎఫ్ నిధులతో ఈ ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 84 సంవత్సరాలుగా ఈ ఆలయం పెద్ద ఆంజనేయస్వామి ఆలయంగా పేరు పొంది ఎంతో గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. ఎందరో భక్తులకు ఈ స్వామి వారిపై అచంచల విశ్వాసం ఉందని పేర్కొన్నారు. అటువంటి ఆలయ పునర్నిర్మాణ భూమి పూజలో పాల్గొనడం తనకు చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం రావులపాడులో జరిగిన శ్రీ ఆంజనేయ స్వామి వారి వార్షికోత్సవం లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.





## ఎస్. యానాం ఆంధ్రా గోవా కోకో బీచ్ లో శ్రీ కాలభైరవ స్వామి వారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

**అమలాపురం బ్యూరో చీఫ్ ఆగష్టు 30 నంది పత్రిక** ఎస్ యానం ఆంధ్రా గోవా కోకో బీచ్ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న శ్రీ కాలభైరవ స్వామి వారి ఆలయ నిర్మాణానికిలి శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ఆదివారంనాడు శాస్త్రోక్తంగా భూమి పూజ చేసి శంకుస్థాపన నిర్వహించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఆధ్యాత్మికతతో పాటు పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఎస్. యానాం, ఆంధ్రా గోవా కోకో బీచ్ ప్రాంతంలో శ్రీ కాలభైరవ స్వామి ఆలయం రూపుదిద్దుకోవడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. ఈ ఆలయ నిర్మాణంతో ఈ ప్రాంతం మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుందని, వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రాంగణంలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ వైభవకరమైన కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, స్థానిక కూటమి నాయకులు, గ్రామ పెద్దలు మరియు విపరీతమైన సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఇంటింటికీ కూటమి అభివృద్ధి.. ప్రజల ముంగిట ఎమ్మెల్యే సౌమ్య

**రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ.. ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేస్తున్నాం - ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగష్టు 30నంది పత్రిక:** కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రజల్లోకి విస్తృతంగా వెళ్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం చందర్లపాడు మండలం కోనాయపాలెం గ్రామంలో కూటమి నేతలతో కలిసి డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో నందిగామ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ, ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వారికి వివరించారు. నియోజకవర్గంలో ప్రజల అవసరాలు, స్థానిక సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్కటిగా చేపడుతూ ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. రెండేళ్లలో చేపట్టిన పనులతో పాటు భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత.. సంక్షేమానికి పెద్దపీట కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే సౌమ్య గారు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నందిగామ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఒక్కరోజులో అన్నీ పూర్తి చేస్తామని చెప్పడం కాకుండా.. అవసరాలను గుర్తించి, ప్రాధాన్యత నిర్ణయించి, ఒక్కో సమస్యకు పరిష్కారం చూపుతూ ముందుకు సాగుతున్నామని ఆమె వివరించారు. ప్రజల ఆశీస్సులతో నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ స్థానికులు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు..



## 35వ రోజుకు చేరిన 'ఇంటింటికీ టీడీపీ'.. 94 లక్షల ఇళ్లకు చేరిన ప్రచారం

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ తెలుగుదేశం 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఆదివారంతో ఈ కార్యక్రమం 35వ రోజు పూర్తి చేసుకుంది. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 94.22 లక్షల ఇళ్లను సందర్శించినట్లు టీడీపీ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆదివారం ఒక్కరోజే టీడీపీ నాయకులు, కార్యకర్తలు 1,78,567 కుటుంబాలను నేరుగా కలిశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, వారి అభిప్రాయాలను తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం సాగుతోంది.

# బీసీ రిజర్వేషన్లపై కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి శుభాష్

**కడియం బ్యూరో చీప్ ఆగస్టు 30 నంది పత్రిక** స్థానిక ఎన్నికలలో బీసీలకు మూడవ వంతు రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక,కర్మాగారాలు, బాయిలర్లు,ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ శాఖల మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం మాదవరాయుడుపాలెంలో ఆదివారం పలు కార్యక్రమాల్లో పాల్గొనడానికి విచ్చేసిన ఆయన ఆ గ్రామ మాజీ సర్పంచ్ అన్నందేవుల చంటి స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నేత లోకేష్ లు ఎన్నికలలో ఇచ్చిన హామీలు ప్రకారం ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారన్నారు. వైకాపా నేతలు ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా కోటమి ప్రభుత్వం తిప్పి కొడుతుందన్నారు. స్థానిక ఎన్నికలను అడ్డుకోవడానికి వారు చేసే ప్రయత్నాలు ఫలించవని ఆయన స్పష్టం చేశారు.రానున్న స్థానిక ఎన్నికలలో కూటమి పార్టీల అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేసారు. అలాగే కొత్త పింఛన్లను త్వరలో మంజూరు చేస్తామని,అర్హులు అందరికీ న్యాయం జరుగుతుందని మంత్రి సుభాష్ తెలిపారు. ఇక అభివృద్ధి పనుల్లో తమ ప్రభుత్వం దూసుకుపోతుందన్నారు. ఎక్కడికక్కడ పటిష్టమైన రోడ్ల నిర్మాణం జరుగుతుందని, ఇది రవాణా వ్యవస్థకు ఎంతో దోహదపడుతుందన్నారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారన్నారు. రెండున్నర సంవత్సరాల కాలంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ చేసిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ప్రశంసలు అందిస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా ఆ గ్రామ పరిధిలో ఉన్న కడియం పేపర్ మిల్లు యాజమాన్యం నిరంకుశ వైఖరి కారణంగా కార్మికులు సమ్మె చేస్తూ తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని, వారికి న్యాయం చేయాలని కార్మిక శాఖ మంత్రి సుభాష్ దృష్టికి ఎమ్మెల్యే తీసుకెళ్లారు. శాసనమండలి డిప్యూటీ మాజీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మహిళా సాధికారతకు తెలుగుదేశం పార్టీ



పెద్దపేట వేస్తుందన్నారు.వివిద కార్పొరేషన్ల ద్వారా మహిళలకు కుట్టు మిషన్లు అందించేందుకు అవసరమైన సుమారు రూ.100 కోట్లను విడుదల చేయాలని యువనేత లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని త్వరలో ఆ సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలిపారు. పురాతన ఇంటిని రీ మోడల్ చేసిన చంటి స్వగృహాన్ని వారు తిలకించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కడియం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి నాని తదితరులు ఉన్నారు.

# పిజిఆర్ఎస్ సేవలపై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలపండి

## జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



**ఏలూరు, బ్యూరో చీఫ్ , ఆగష్టు, 30 నంది పత్రిక** పిజిఆర్ఎస్ ద్వారా అందిన సేవలపై ప్రజల అభిప్రాయాలను క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కోరారు. ప్రజలకు మరింత పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఈ కార్యక్రమంలో భాగంగా పిజిఆర్ఎస్ ద్వారా అందించే సేవలపై ప్రజలను అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా కోరుతున్నదన్నారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించడం జరిగిందన్నారు. పి.జి.ఆర్.ఎస్ సేవల పొందిన ప్రజలు తమ మొబైల్ ఫోన్ల ద్వారా క్యూ.ఆర్ కోడ్ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని, సంతృప్తి స్థాయిని తెలియజేయవచ్చన్నారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ చేరుతుందని అన్నారు. ఆర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. క్యూ.ఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు







## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి

**భీమవరం బ్యూరో చీప్ ఆగస్టు 30 నంది పత్రిక** సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతంలో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గోదావరి పుష్కర ఘాట్ల పరిశీలనలో భాగంగా పొన్నపల్లి పడవల రేవు నుంచి వలంధర రేవు వరకు వశిష్ట గోదావరి నదిలో మరపడవపై ప్రయాణించి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మొగల్తూరులో ముఖ్యమంత్రి పాల్గొనే ప్రజా సభా వేదిక, కేడర్ స్ట్రెంత్ సమావేశం జరిగే ప్రాంతం, హెలిప్యాడ్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మొగల్తూరులోని లక్ష్మీ హరిప్రియ కన్వెన్షన్ హాల్లో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారుల తో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.సెప్టెంబర్ 1వ తేదీ ఉదయం 10:30 గంటలకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు మొగల్తూరు హెలిప్యాడ్కు చేరుకుని, అక్కడి నుంచి గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా రోడ్డు మార్గంలో నరసాపురం పట్టణంలోని పొన్నపల్లి ప్రాంతానికి చేరుకుని ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.అనంతరం గోదావరి పుష్కర ఘాట్ల పరిశీలనలో భాగంగా పొన్నపల్లి పడవల రేవు నుంచి వలంధర రేవు వరకు వశిష్ట గోదావరి నదిలో పడవపై ప్రయాణించి పుష్కర ఘాట్లను పరిశీలిస్తారని తెలిపారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో మొగల్తూరు సభా ప్రాంగణానికి చేరుకుని ప్రజా సభలో పాల్గొంటారని చెప్పారు.ప్రజా సభ అనంతరం ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన స్టాల్స్ను ముఖ్యమంత్రి పరిశీలిస్తారని, భోజన విరామం అనంతరం కేడర్ స్ట్రెంత్ సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం హెలిప్యాడ్కు చేరుకుని అక్కడి నుంచి అమరావతికి బయలుదేరి వెళ్తారని జిల్లా కలెక్టర్ వివరించారు.ముఖ్యమంత్రి పర్యటించే సభా ప్రాంగణం, హెలిప్యాడ్, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రాంతం, కేడర్ సమావేశం వేదిక, పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల సౌకర్యార్థం చేపట్టాల్సిన ఏర్పాట్లకు సంబంధించి అధికారులకు అప్పగించిన బాధ్యతలను అత్యంత పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు అధికారులు తమకు కేటాయించిన విధులను అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం ఆస్మి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రాంతాలు, ముఖ్యమంత్రి లబ్ధిదారుల గృహాలకు వెళ్లే ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామని చెప్పారు.

ముఖ్యమంత్రి పర్యటన ఎలాంటి అంతరాయం లేకుండా సాఫీగా జరిగేలా భద్రతా ప్రణాళికలను పటిష్టంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రయాణించే మార్గాల్లో రోడ్డుకు ఇరువైపులా బాంబ్ డిస్పోజల్ టీమ్స్, డాగ్ స్క్వాడ్, స్పెషల్ పార్టీ పోలీసులతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఈ తనిఖీల ప్రక్రియ ముఖ్యమంత్రి పర్యటన పూర్తయ్యే వరకు నిరంతరం కొనసాగుతుందని ఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ, నరసాపురం ఆర్డీవో దాసిరాజు, భీమవరం ఆర్డీవో కె. ప్రవీణ్ కుమార్ రెడ్డి, తాడేపల్లిగూడెం ఆర్డీవో ఎం. సూర్యారావు, మున్సిపల్ కమిషనర్లు, పోలీసు అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.











## ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెప్టెంబర్ 1 వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం నియోజకవర్గం, మొగల్తూరు పర్యటన వివరాలు.

**భీమవరం బ్యూరో చీప్ ఆగస్టు 30 నంది పత్రిక**

ఉదయం 09:45 గంటలకు గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, ఉండవల్లి నివాసం నుండి
హెలికాప్టర్ ద్వారా బయలుదేరుతారు.
ఉదయం 10:30లకు పశ్చిమ గోదావరి జిల్లా,
మొగల్తూరు మండలం, మొగల్తూరు గ్రామం
హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
ఉదయం 10:30 నుండి 10:40 వరకు:
ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ఇతరుల నుండి స్వాగతం.
ఉదయం 10:40 లకు
మొగల్తూరు గ్రామం, మొగల్తూరు మండలం నుండి
రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి
లిఉదయం 11:05 లకు పశ్చిమ గోదావరి జిల్లా,
నరసాపురం టౌన్, పొన్నపల్లి, గోదావరి ఏటిగట్టు పక్కన, (2వ మరియు 3వ వార్డులు)
చేరుకొని పర్యటన సమయం మరియు ముఖాముఖి వేదిక.
ఉదయం 11:05 నుండి 11:45 వరకు
ఎన్టీఆర్ భరోసా పింఛను లబ్ధిదారులతో ముఖాముఖి అఠవఠీఖ్షఅశీఅ మరియు బోట్ (పడవ) ప్రయాణం.
లిలిఉదయం 11:45 లకు
నరసాపురం టౌన్ లో ని ముఖాముఖి వేదిక నుండి
రోడ్డు మార్గం ద్వారా బయలు దేరుతారు.
మధ్యాహ్నం 12:00 లకు
మొగల్తూరు గ్రామం, మొగల్తూరు మండలం లో
ప్రజా వేదిక కు చేరుకొనుట.
లిలిమధ్యాహ్నం 12:00 నుండి 01:40 వరకు:
ప్రజా వేదిక సమావేశంలో పాల్గొనుట మరియు స్టాళ్లను సందర్శించుట.
మధ్యాహ్నం 01:40 నుండి 02:50 వరకు:
కేటాయించబడిన సమయం (రిజర్వ్).
మధ్యాహ్నం 02:50లకు ప్రజా వేదిక, మొగల్తూరు గ్రామం నుండి
రోడ్డు మార్గం ద్వారా బయలుదేరుట.
మధ్యాహ్నం 02:55 లకు
మొగల్తూరు గ్రామం, నరసాపురం నియోజకవర్గం, పశ్చిమ గోదావరి జిల్లా లోని కేడర్ సమావేశ వేదిక లో పాల్గొనుట.
మధ్యాహ్నం 02:55 నుండి 04:25 వరకు:
పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొనుట.
సాయంత్రం 04:25లకు
కేడర్ సమావేశ వేదిక, మొగల్తూరు గ్రామం నుండి
రోడ్డు మార్గం ద్వారా బయలుదేరుట.
సాయంత్రం 04:30 లకు మొగల్తూరు గ్రామం హెలిప్యాడ్ వద్దకు చేరుకొనుట.
సాయంత్రం 04:35 లకు
హెలిప్యాడ్, మొగల్తూరు గ్రామం నుండి హెలికాప్టర్ ద్వారా తాడేపల్లి లోని ఉండవల్లి నివాసానికి బయలుదేరి వెళతారు.

# ప్రజా సేవకుల స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

## ఎమ్మెల్యే సౌమ్య



**విజయవాడ బ్యూరో చీఫ్ ఆగస్టు 30 నంది పత్రిక** ప్రజల కోసం నిబద్ధతతో పనిచేసిన ప్రజా సేవకుల సేవలను స్మరించుకోవడంతో పాటు వారి స్ఫూర్తిని భావితరాలకు అందించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. వీరులపాడు మండలం పల్లంపల్లి గ్రామంలో మాజీ నీటి సంఘం అధ్యక్షులు యంద్రపల్లి కృష్ణారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆమె కూటమి నేతలతో కలిసి పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ : గ్రామీణాభివృద్ధి, రైతుల సంక్షేమానికి కృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయమని, కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, సాగునీరు, రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. నందిగామ నియోజకవర్గంలోని గ్రామాలకు అవసరమైన మౌలిక వసతులు, సాగునీటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# రక్తదానంతో నిండు ప్రాణాలకు భరోసా

## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో మెగా రక్తదాన శిబిరం

## రక్తదాతలకు హెల్మెట్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే సౌమ్య



**విజయవాడ బ్యూరో చీప్ ఆగస్టు 30 నంది పత్రిక** ప్రజాసేవే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కంచికచర్లలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే సౌమ్య మాట్లాడుతూ** : రక్తదానం మహోన్నతమైన సేవ అని, ఒక్క యూనిట్ రక్తం ఆపదలో ఉన్న నిండు ప్రాణాన్ని కాపాడగలదని ఆమె పేర్కొన్నారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. రక్తదాతలకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీల రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగంటి వెంకట సత్యనారాయణ బాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు, రక్తదాతలు పాల్గొన్నారు.



# ఏఐ టెక్నాలజీతో జెండావందనం.. కరీంనగర్ బాల మేధావికి ఈటల అభినందనలు

కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన 13 ఏళ్ల బాల మేధావి శ్రీ సృష్టి సాయి సాంకేతిక ప్రతిభపై మల్కాజిగిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ప్రశంసల వర్షం కురిపించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో మొబైల్ ద్వారా నియంత్రించే వైఫై ఆధారిత ఫ్లాగ్ హోస్టింగ్ (జెండా వందనం) సిస్టమ్ను రూపొందించిన సృష్టి సాయిని ఆయన అభినందించారు. చిన్న వయసులోనే సాంకేతికతపై పట్టు సాధించి అద్భుత ఆవిష్కరణ చేసిన ఆ బాలుడు ఎందరికో ఆదర్శమని కొనియాడారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా న్యాయవాదులు కృషి చేయాలి






## కుల వివక్ష నిర్మూలనకు అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలి... ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ బీజేపీ ఎస్సీ మోర్చా లీగల్ సెల్ సమావేశంలో బిజెపి రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి మధుకర్ జీ అభిబాషణ

**విజయవాడ, బ్యూరో చీఫ్ ఆగస్టు 30: నంది పత్రిక** సమాజంలో దళితుల పట్ల కొనసాగుతున్న అసమానతలు, వివక్ష తొలగిపోయేలా ప్రతి దళిత కుటుంబానికి న్యాయం అందించేందుకు ఎస్సీ మోర్చా లీగల్ సెల్‌లోని న్యాయవాదులు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర సంఘటనా ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్ పిలుపునిచ్చారు. అక్రమ కేసుల్లో చిక్కుకుని సరైన న్యాయం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దళితులను గుర్తించి వారికి న్యాయ సహాయం అందించాలని సూచించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా లీగల్ సెల్ రాష్ట్రస్థాయి సమావేశం జరిగింది. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా నూకల మధుకర్ హాజరయ్యారు. విశిష్ట అతిథులుగా విజయవాడ బార్ కౌన్సిల్ సభ్యులు, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి ఉప్పాలపాటి శ్రీనివాసరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాజీ పాల్గొన్నారు.

**అంబేద్కర్ ఆశయాలను ఆచరణలోకి తేవాలి** ఈ సందర్భంగా నూకల మధుకర్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన జీవితంలో ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొన్నప్పటికీ వాటికి వెరవకుండా తన జీవితాన్ని తాను కోరుకున్న రీతిలో మలుచుకుని దేశానికి మార్గదర్శకమైన రాజ్యాంగాన్ని అందించారని గుర్తుచేశారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. రాజ్యాంగ హక్కులను సద్వినియోగం చేసుకుని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. బహిరంగ వేదికలపై కుల వివక్షకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న కొందరు, ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. మాటలకు, చేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలగించి అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని సమాజంలో ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**ప్రతి జిల్లాలో న్యాయ సహాయ వ్యవస్థ** పనతల సురేష్ మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో అన్ని మోర్చాలకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ మోర్చాకు అనుబంధంగా లీగల్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రస్థాయి కన్వీనర్‌గా డాక్టర్ అశోక్‌ను నియమించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్సీ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్లు సమావేశంలో పాల్గొన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, న్యాయపరమైన సమస్యలను గుర్తించి వారికి అండగా నిలవాలని, న్యాయ సహాయం అందించి మెరుగైన జీవితానికి బాటలు వేయాలని కోరారు. ఈసమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వుల్లూరి గంగాధర్, జోనల్ ఇన్‌చార్జి మేకల లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సర్వశుద్ధి రాజు, పార్టీ లీగల్ సెల్ సభ్యుడు చె. ఉమామహేశ్వరరెడ్డి ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్ బి రాజేష్ కుమార్, నంద్యాల జిల్లా ఎస్సీ మోర్చా లీగల్ సెల్ కన్వీనర్ బిజ్జం వెంకట చలపతి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడంలేదా?





## రాయలసీమ ప్రాంతానికి నీటి విడుదల ఎప్పుడు చేస్తారో చెప్పాలి? మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి

**నంద్యాల సిటీ బ్యూరో ఆగస్టు 30 ( నంది పత్రిక )** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు దాటి మూడవ సంవత్సరంలో పాలన మరింత దారుణంగా మారిందని, మొదటి సంవత్సరంలో పంటనష్టం, రెండవ సంవత్సరం గిట్టుబాటు ధరలు లేవని, ఈ సంవత్సరం పంటలు సాగుచేయలేని దుర్భిక్షపరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు కూటమి ప్రభుత్వానికి కనిపించడం లేదా? రాయలసీమ ప్రాంతానికి ఎప్పుడు నీటి విడుదల చేస్తారో అధికారులు సమాధానం చెప్పాలని ఆయన సూటిగా ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ లో 873 అడుగుల నీటి నిల్వలు ఉన్నప్పటికీ రాయలసీమ ప్రాంతానికి సాగునీరు, త్రాగునీరు వదలాలని ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల మండలం కానాల చెరువును మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి స్థానిక నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...కానాల చెరువులో చుక్కనీరు లేక ఎండిపోయిన పరిస్థితి ఉన్నదని, గత రెండు సంవత్సరాలుగా రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్న తరుణంలో ఈ ఏడాది అయినా ప్రభుత్వం నీటిని దిగువకు విడుదల చేస్తారని ఆశగా ఎదురు చూసిన రైతన్నల ఆశలు అడిఆశలుగా మారాయని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులే రైతులను పంటలు సాగు చేయవద్దని చెప్పడం జరిగిందని, పంటలు సాగు చేయని పక్షంలో ప్రత్యామ్నాయ వనరులను కల్పించాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90శాతం పూర్తి చేస్తే కేవలం 10శాతం మాత్రం పూర్తి చేయాల్సి ఉండగా సిఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను నిలిపివేయడం ఒక దొంగచాటు వ్యవహారమని విమర్శించారు. రాయలసీమ ప్రాంతంలో సాగునీరు లేక రైతులు పంటలు పండించని పరిస్థితి, ఇక గ్రామాల్లో త్రాగునీరు లేక పశువులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఈ దారుణమైన పరిస్థితిని గమనించి ప్రభుత్వం దిగువకు నీటిని వదిలి రాయలసీమ ప్రాంత వాసులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కనీసం పంటల ఇన్స్యూరెన్స్ లేదని, అన్నదాత సుఖీభవ పథకం ఊసేలేదని విమర్శించారు. కానాల చెరువులో మట్టి త్రవ్విన గుంతలు కనిపిస్తున్నాయని, ఈ చెరువులో మట్టిని ఏప్రాజెక్ట్ కు అవసరం అయి చేశారు? ఈ మట్టి వల్ల ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం ఎంత? మైనింగ్ వారికి ఎంత ముట్టింది? ఇరిగేషన్ వారికి ఎంత అందింది? చెప్పాలని, ఈ విషయంపై ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారం అంతా అధికారుల నిర్లక్షానికి నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ విజయ శేఖర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రంగారావు,పిడి ఉసేన్,శంకర్, రంగారావు, కాసిం,మరియధాస్,కరీం,పక్రుదిన్, అల్లూరయ్య, సన్నా, జమాల్ బాషా, ఫరూక్, నాగవుశేని, మధు గౌడ్, పకీర్ సా, గ్రామ రైతులు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.





# అది ఆర్ఎస్ఎస్ ఉపయోగించే పాత ట్రిక్: అసదుద్దీన్ ఒవైసీ



ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన తాజా వ్యాఖ్యలపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. “భారత్‌లో ముస్లింలు ఉండకూడదని భావించేవాడు హిందువే కాదు“ అని భగవత్ పేర్కొనడంపై ఒవైసీ స్పందిస్తూ.. ఇది ఆర్ఎస్ఎస్ ఉపయోగించే పాత ట్రిక్ అని, వారి ద్వంద్వ వైఖరికి ఇది నిదర్శనమని దుయ్యబట్టారు. సోషల్ మీడియా వేదికగా ఆయన ఈ మేరకు తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఆర్ఎస్ఎస్‌కు రెండు రకాల మాటలు ఉంటాయని, ప్రపంచానికి ఒకటి, తమ సొంత సభ్యులకు మరొకటి చెబుతారని ఒవైసీ ఆరోపించారు. ముస్లింలు, ఇతర మైనారిటీల పట్ల వారి ప్రధాన సిద్ధాంతకర్తలు, రచయితలు ఏం చెప్పారో ఆర్ఎస్ఎస్ ఎన్నడూ ఖండించలేదని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెడ్గేవార్, నాడు గాంధీజీ ప్రతిపాదించిన హిందూ-ముస్లిం ఐక్యతను వ్యతిరేకించడం వల్లే కాంగ్రెస్‌ను వీడారని ఒవైసీ పేర్కొన్నారు. అలాగే, మరో సిద్ధాంతకర్త గోల్వాల్కర్.. ముస్లింలు, క్రైస్తవులను దేశానికి ‘అంతర్గత ముప్పు‘గా అభివర్ణించారని ఆయన తన పోస్టులో ప్రస్తావించారు.గుజరాత్‌లో ముస్లింలపై జరిగిన దాడులను కూడా ఒవైసీ గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ ముసుగు పాలనలోనే ఆ దారుణాలు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ), క్రైస్తవులను లక్ష్యంగా చేసుకున్న మతమార్పిడి నిరోధక చట్టాలు, యూఏపీఏ వంటి కఠిన చట్టాల దుర్వినియోగం వెనుక ఆర్ఎస్ఎస్ భావజాలమే ఉందని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో, సావర్కర్, హెడ్గేవార్, గోల్వాల్కర్ వంటి వారి విషపూరిత రచనలలోని కొన్ని భాగాలను భగవత్ బహిరంగంగా చదివి వినిపించాలని, ఆ తర్వాత ఆర్ఎస్ఎస్ నిజస్వరూపంపై ప్రజలే ఓ నిర్ణయానికి వస్తారని ఒవైసీ సవాల్ విసిరారు.

## ఏలూరులో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



**ఏలూరు, బ్యూరో చీఫ్ ఆగస్టు, 30 నంది పత్రిక;** ఏలూరులోని సిద్ధార్థ ట్రస్ట్ పాఠశాలలో జరిగిన నీట్ పిజి ప్రవేశ పరీక్షా కేంద్రాన్ని ఆదివారం జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఎటువంటి అవాంఛనీయ సంఘటనలో లేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగిందనన్నారు. భారతీయ విశ్వవిద్యాలయాలు మరియు కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్( పీజీ) వైద్య సీట్ల కోసం భారతీయ పౌరుల అర్హతను నిర్ణయించడానికి నిర్వహించే జాతీయ స్థాయి పరీక్ష అని, ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరులోని సర్.సి.ఆర్. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మరియు సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూల్ నిర్వహించడం జరిగిందన్నారు. ,పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సర్.సి.ఆర్. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 214 మంది విద్యార్థులకు గాను 213 మంది విద్యార్థులు మరియు సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూల్ లో 175 మంది విద్యార్థులకు గాను 164 విద్యార్థులు హాజరయ్యారన్నారు. మొత్తంగా జిల్లాలో నీట్ పిజి ప్రవేశ పరీక్షకు 389 మంది విద్యార్థులకు గాను 377 మంది విద్యార్థులు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకున్నదని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. ఏలూరు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, ఏలూరు, పెదపాడు తహసీల్దార్లు ఎస్. వి. రవీంద్రనాధ్, ఏ.కృష్ణజ్యోతి, ప్రభృతులు పాల్గొన్నారు.

## పిజిఆర్ఎస్ సేవలపై పై క్యూ.ఆర్ కోడ్ ద్వారా స్పందన తెలియజేయండి -జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి



**ఏలూరు, ,బ్యూరో చీఫ్ ఆగష్టు, 30 నంది పత్రిక** పిజిఆర్ఎస్ ద్వారా అందిన సేవలపై ప్రజల అభిప్రాయాలను క్యూ ఆర్ కోడ్ ద్వారా తెలియజేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి కోరారు. ప్రజలకు మరింత పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన సేవలను అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, ఈ కార్యక్రమంలో భాగంగా పిజిఆర్ఎస్ ద్వారా అందించే సేవలపై ప్రజలను అభిప్రాయాలను క్యూఆర్ కోడ్ ద్వారా కోరుతున్నదన్నారు. జిల్లా, మండల స్థాయి పి.జి.ఆర్.ఎస్ కేంద్రాలలో ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాలలో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్యూ.ఆర్ కోడ్ ప్రముఖంగా ప్రదర్శించడం జరిగిందన్నారు. పి.జి.ఆర్.ఎస్ సేవల పొందిన ప్రజలు తమ మొబైల్ ఫోన్‌ల ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ అభిప్రాయాన్ని, సంతృప్తి స్థాయిని తెలియజేయవచ్చన్నారు. క్యూ.ఆర్ కోడ్ ప్రజల స్పందన అధికారిక పి.జి.ఆర్.ఎస్ పోర్టల్ చేరుతుందని అన్నారు. అర్జీల స్థితిగతులు తెలుసుకొనుటకు టోల్ ఫ్రీ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. క్యూ.ఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ మరింత మెరుగైన సేవలు అందించుటకు సహకరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు.

# ఫుల్లుగా మందుకొట్టి నీట్ పీజీ పరీక్షకు వచ్చాడు!

**తెలంగాణలో ప్రశాంతంగా ముగిసిన నీట్ పీజీ పరీక్ష**

**రంగారెడ్డి జిల్లాలోని ఓ పరీక్షా కేంద్రంలో వింత ఘటన**

**మద్యం సేవించి పరీక్ష హాల్‌కు వచ్చిన మహ్మద్ రిజ్వాన్ అనే విద్యార్థి**

**గుర్తించి బయటకు పంపిన సిబ్బంది, కేసు నమోదు చేసిన పోలీసులు**

**విద్యార్థికి బ్రీత్ అనలైజర్ టెస్ట్.. కొనసాగుతున్న విచారణ**



తెలంగాణ వ్యాప్తంగా ఆదివారం జరిగిన నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు అభ్యర్థులు సకాలంలోనే కేంద్రాలకు చేరుకున్నారు. అయితే, రంగారెడ్డి జిల్లాలోని ఓ పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థి మద్యం సేవించి హల్‌చల్ చేయడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడలోని పరీక్షా కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రిజ్వాన్ అనే విద్యార్థి సెక్యూరిటీ తనిఖీలను తప్పించుకుని నేరుగా పరీక్ష హాల్‌లోకి ప్రవేశించాడు. లోపల అతని ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటం, అతని నుంచి మద్యం వాసన రావడంతో సిబ్బంది వెంటనే అప్రమత్తమయ్యారు. పరీక్ష రాసేందుకు అనర్హుడని నిర్ధారించుకున్న సిబ్బంది అతడిని హాల్ నుంచి బయటకు పంపించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు రిజ్వాన్‌కు బ్రీత్ అనలైజర్ టెస్ట్ నిర్వహించగా, అతను మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మిగతా కేంద్రాల్లో పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి.

# అదే పెద్దపులి మళ్లీ వచ్చింది.. పోలవరం ప్రాజెక్టు వద్ద భయాందోళనలో ప్రజలు

ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు సమీపంలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రాజెక్టు పరిధిలోని దేవరగొండి జంట టన్నెళ్ల వద్ద పులి తిరుగుతుండటంతో స్థానిక గ్రామ ప్రజలు, ప్రాజెక్టు సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. రెండు దూడలను చంపేయడంతో ఈ భయం మరింత పెరిగింది. అటవీ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి పులిని బంధించేందుకు చర్యలు చేపట్టారు. వివరాల్లోకి వెళితే, శనివారం రాత్రి పోలవరం ప్రాజెక్టు పాత దేవరగుండి టన్నెల్ వద్ద ఉన్న రెగ్యులేటర్ సమీపంలో స్థానికులు పులిని గమనించారు. అక్కడే ఉన్న రెండు దూడలపై అది దాడి చేసి చంపేసింది. ఈ ఘటనతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఆదివారం ఉదయం ముంపు గ్రామమైన దేవరగొండిలోని జంట టన్నెళ్ల వద్ద కూడా పులి కదలికలను అధికారులు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు ప్రాజెక్టు ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు, స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**గతంలో పట్టుబడి, మళ్లీ ప్రత్యక్షం**

ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోకి ప్రవేశించిన ఈ పులి, అప్పట్లో బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోనూ సంచరించి కలకలం రేపింది. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లా అడవుల్లోకి వెళ్లింది. రాయవరం సమీపంలో దీని సంచారం ఎక్కువ కావడంతో, పుణే నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఫిబ్రవరిలో దీనిని సురక్షితంగా పట్టుకుంది.

# వెలిగొండ జలాలతో.. బద్వేలు నియజకవర్గ భూములకు కొత్త సిరులు..!






## డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి

### కృష్ణమ్మ రాకతో కరువు నేలకు మహర్దశ

**కడప బ్యూరో చీఫ్, ఆగస్టు 30 : నంది పత్రిక** వెలిగొండ ప్రాజెక్టు ద్వారా బద్వేలు నియోజకవర్గంలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల రైతులకు సాగునీరు అందుబాటులోకి రానుండడంతో ఈ ప్రాంత వ్యవసాయానికి మహర్దశ పట్టనుందని డీసీసీబీ చైర్మన్, బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి మంచూరి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆగస్టు 31న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించే.. చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పోరుమామిళ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన డ్రోన్ ఎల్ఈడీ ప్రదర్శన కన్నులపండువగా సాగింది. సుమారు 20 అడుగుల పొడవైన ఎల్ఈడీ ఆకృతులను డ్రోన్ల ద్వారా ఆకాశంలో ప్రదర్శించడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీసీసీబీ చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. వెలిగొండ ప్రాజెక్టు పశ్చిమ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పంతో ఆ కల సాకారం అవుతోందన్నారు. కృష్ణా జలాలు బద్వేలు నియోజకవర్గానికి చేరడం వల్ల పోరుమామిళ్ల, కలసపాడు, కాశీనాయన మండలాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతులు కరువుపై ఆధారపడకుండా పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని, వ్యవసాయంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. వెలిగొండ జలాలు రైతుల పొలాల్లోకి చేరితే ఈ ప్రాంతంలో పచ్చదనం పెరిగి, రైతుల జీవితాల్లో ఆర్థిక వెలుగులు నిండుతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి, ఇప్పుడు అదే ప్రాజెక్టును ప్రారంభించడం చారిత్రాత్మకమని సూర్యనారాయణరెడ్డి అన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన తరువాత కరువు ప్రాంతాలకు శాశ్వతంగా సాగునీటి భద్రత ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఆకాశంలో వెలిగిన వెలిగొండ వైభవం** : డ్రోన్‌లతో నిర్వహించిన ఎల్ఈడీ ప్రదర్శనలో వెలిగొండ ప్రాజెక్టు, కృష్ణా జలాలు, సాగునీటి ప్రయోజనాలను ప్రతిబింబించే దృశ్యాలను ఆకాశంలో ఆవిష్కరించారు. సాయంత్రం చీకట్లు కమ్ముకున్న వేళ ఆకాశంలో వెలుగులు విరజిమ్ముతూ సాగిన ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. పిల్లలు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించారు. కార్యక్రమంలో బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, అధికారులు, మార్కెట్ యార్డు కమిటీ చైర్ పర్సన్ సుప్రియ, స్థానిక కూటమి పార్టీ నాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు, ఆయకట్టు రైతులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.








## విజయసాయిరెడ్డిని కేఏ పాల్ తో పోల్చిన బొత్స

**వైసీపీలో సజ్జల నెంబర్ 1, జగన్ నెంబర్ 2 అంటూ విజయసాయి వ్యాఖ్యలు**

**ఈ కామెంట్లపై తీవ్రంగా స్పందించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ**

**విజయసాయి రెడ్డిని కేఏ పాల్‌తో పోల్చుతూ ఘాటు విమర్శ**

**ఆయన వ్యాఖ్యలతో సమయం వృథా చేసుకోవద్దని పార్టీ శ్రేణులకు సూచన**

**విజయసాయి వ్యాఖ్యలతో వైసీపీలో బయటపడిన అంతర్గత విభేదాలు**



మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ నాయకత్వాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. వైసీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి నెంబర్ 1 అని, జగన్ నెంబర్ 2 అని ఆయన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.. విజయసాయి రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "విజయసాయి రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని నేను స్పష్టంగా చెబుతున్నాను. ఆయన మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పని లేదు. రాజకీయాల్లో ఇలాంటి వాళ్లు వస్తూ పోతూ ఉంటారు. ఇంతకుముందు మనకు కేఏ పాల్ ఒకరు ఉండేవారు, ఆయన ఏదేదో మాట్లాడుతుండేవారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి రెండో వ్యక్తిగా తయారయ్యారు. ఆయన మాటలకు విలువ ఇచ్చి స్పందించడం అంటే మన సమయాన్ని మనం వృథా చేసుకోవడమే. చూడండి, శుభ్రంగా సాయంత్రం వేళ ప్రశాంతంగా కూర్చున్నాం. ఇలాంటి సమయంలో ఆ పనికిమాలిన మాటల గురించి ఎందుకు మాట్లాడాలి? దానివల్ల నా సమయం వృథా అవ్వడమే కాకుండా, అసలు విషయాలైన ప్రజా సమస్యల నుంచి మన దృష్టి మళ్లుతుంది. ప్రజల సమస్యలు ఎన్నో ఉన్నాయి, వాటిపై దృష్టి పెట్టాలి. అంతేకానీ, ఇలాంటి వాటి కోసం కాదు. ఆయనకేదో అది పెద్ద విషయంలా అనిపిస్తే, దానికోసం ఒక ప్రెస్ మీట్ పెట్టుకోమనండి. బహిరంగంగా చెప్పుకోమనండి. అంతేగానీ, దానికోసం మేం సమయం కేటాయించం. అనవసరంగా ఇలాంటి విషయాల గురించి చర్చించి మన విలువైన సమయాన్ని పాడుచేసుకోవడం ఎందుకు? కాబట్టి, ఆ విషయం గురించి మళ్లీ మళ్లీ అడిగి మీ సమయం, నా సమయం వృథా చేయొద్దని కోరుతున్నాను" అని బొత్స పేర్కొన్నారు.

## నా జీవితాన్ని నరకం చేశారు: ప్రధాని మోదీపై రుచికా సింగ్ సంచలన వీడియో

**ప్రధాని మోదీపై వ్యాఖ్యలతో మళ్లీ వార్తల్లోకి వచ్చిన రుచికా సింగ్**

**నా జీవితాన్ని మోదీ నరకం చేశారంటూ కొత్త వీడియో విడుదల**

**ఇటీవల సీజేపీ నిరసనల వేళ మోదీపైనా, ఆయన తల్లిపైనా తీవ్ర వ్యాఖ్యలు**

**క్షమించమని కోరిన నోటితోనే.. ఇప్పుడు తగ్గేదే లేదంటున్న యువతి**



ప్రధాని నరేంద్ర మోదీపై, ఆయన దివంగత తల్లిపై అసభ్యకర వ్యాఖ్యలు చేసి దేశవ్యాప్తంగా తీవ్ర వివాదంలో చిక్కుకున్న రుచికా సింగ్ మళ్లీ వార్తల్లో నిలిచింది. కొద్ది వారాల క్రితం క్షమించమని వేడుకున్న ఆమె, ఇప్పుడు "నా జీవితాన్ని మోదీ నరకం చేశారు" అంటూ తీవ్ర ఆరోపణలు చేస్తూ ఓ కొత్త వీడియోను విడుదల చేసింది. ఇందులో ప్రధానిపై తీవ్ర పదజాలం వాడుతూ, తాను వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేయడం సంచలనం రేపుతోంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ కొత్త వీడియోలో ఆమె మాట్లాడుతూ, "మోదీ నా జీవితాన్ని నరకప్రాయం చేశారు. నాకు స్వేచ్ఛ లేదు. ఎక్కడికి వెళ్లినా ముఖం దాచుకోవాల్సి వస్తోంది. ఓ 15 ఏళ్ల బాలికను చిత్రహింసలకు గురిచేశారు. ఇకపై నేను కోల్పోవడానికి ఏమీ లేదు" అని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రధానిని 'పిరికివాడు' అని సంబోధిస్తూ, తాను ఈ పోరాటంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. కొద్ది వారాల క్రితం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో రుచికా సింగ్.. ప్రధాని మోదీపై, ఆయన తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నోయిడా పోలీసులు జూలై 29న జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, కేసును ఢిల్లీ పోలీసులకు బదిలీ చేశారు. అప్పట్లో తాను 15 ఏళ్ల బాలికనని, స్నేహితులతో కలిసి నిరసనకు వెళ్లి ఆవేశంలో అలా మాట్లాడానని, మోదీ క్షమించే వరకు క్షమాపణలు కోరుతూనే ఉంటానని మరో వీడియోలో ఆమె పేర్కొంది. ఈ వివాదంపై ప్రధాని మోదీ స్వయంగా స్పందించి, యువత పట్ల ఉదారంగా ఉండాలని సూచించడంతో, ఆమెపై కేసును ఉపసంహరించుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఇప్పుడు మళ్లీ ఆమె తిరుగుబాటు ధోరణితో మాట్లాడటం చర్చనీయాంశమైంది. కాగా, ఈ కొత్త వీడియో ఎక్కడ, ఎప్పుడు రికార్డ్ చేశారనే దానిపై స్పష్టత లేదు. వీడియోలో ఉన్నది నిజంగా రుచికా సింగేనా, ఆమె వయసు ఎంత అనే దానిపై కూడా అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ వీడియో ప్రామాణికతను స్వతంత్రంగా ధృవీకరించలేదని, అందువల్ల దీనిలోని ఆరోపణలను కేవలం ఆరోపణలుగానే చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కొత్త క్లిప్ సోషల్ మీడియాలో మరోసారి భిన్నాభిప్రాయాలకు దారితీసింది.

## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి.. అసలు విషయం చెప్పిన మహేశ్ గౌడ్

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ ఇచ్చింది వాస్తవమేనన్న టీపీసీసీ చీఫ్**

**రాజకీయ సమీకరణాల వల్లే పదవి ఇవ్వడంలో ఆలస్యం జరిగిందని వెల్లడి**

**సెప్టెంబర్ నాటికి పార్టీలోని అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని ధీమా**

**అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీపై వచ్చే నెలలో స్పష్టత**

**కాంగ్రెస్ ఒక మహాసముద్రమని, అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ ఉంటుందని వ్యాఖ్య**



తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత పరిణామాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చింది నిజమేనని ఆయన అంగీకరించారు. అదే సమయంలో, పార్టీలో నెలకొన్న చిన్న చిన్న అసంతృప్తులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నీ సెప్టెంబర్ నాటికి కొలిక్కి వస్తాయని స్పష్టం చేశారు. పార్టీలోని నాయకుల అసంతృప్తిపై మహేశ్ గౌడ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ పార్టీ ఒక మహాసముద్రం లాంటిది. ఇక్కడ నాయకులకు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేసే అవకాశం ఉంటుంది. అయితే, అదే సమయంలో పార్టీ క్రమశిక్షణ కూడా అంతే ముఖ్యం" అని పేర్కొన్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చామని, అయితే కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగా ఆలస్యం జరిగిందని వివరించారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు ఓపిక చాలా అవసరమని ఆయన సూచించారు. మంత్రులు కొండా సురేఖ, చిన్నారెడ్డి వంటి నేతల విషయంలో నెలకొన్న వివాదాలపై అడిగినప్పుడు, ఆ అంశాలను పార్టీ అధిష్ఠానం చూసుకుంటోందని మహేశ్ గౌడ్ తెలిపారు. పార్టీలో ఏవైనా భేదాభిప్రాయాలు ఉంటే వాటిని కూర్చొని మాట్లాడుకుని పరిష్కరించుకుంటామని, సమన్వయంతో ముందుకు సాగుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ నెలలో పార్టీలోని సమస్యలన్నీ పూర్తిగా పరిష్కారమవుతాయని, నాయకుల అసంతృప్తి తొలగిపోతుందని, నామినేటెడ్ పదవుల భర్తీ కూడా పూర్తవుతుందని ఆయన స్పష్టం చేశారు. మహేశ్ గౌడ్ చేసిన ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ విస్తరణపై చర్చ ఊపందుకుంది. సెప్టెంబర్‌లో జరగబోయే కేబినెట్ విస్తరణలో రాజగోపాల్ రెడ్డికి బెర్త్ ఖాయమనే ఊహాగానాలు బలపడ్డాయి.

## ప్రపంచానికే ప్రళయం వచ్చినా.. ఈ దేశం తట్టుకుని నిలబడుతుంది!

ప్రపంచవ్యాప్తంగా పెను విపత్తు సంభవించి, మానవ నాగరికతకే ముప్పు వాటిల్లితే ఏ దేశం తట్టుకోగలదు? ఈ ప్రశ్నకు సమాధానం కనుగొనేందుకు జర్మనీలోని హేగన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఒక విస్తృత అధ్యయనం చేపట్టారు. 'గ్లోబల్ ఛాలెంజెస్' అనే ప్రముఖ సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైన ఈ అధ్యయనం ప్రకారం, అలాంటి తీవ్రమైన విపత్తులను ఎదుర్కొని నిలబడగల అత్యంత స్థితిస్థాపకత కలిగిన దేశం ఆస్ట్రేలియా అని తేలింది. పరిశోధకులు ప్రపంచ విపత్తులను ప్రధానంగా మూడు రకాలుగా వర్గీకరించి విశ్లేషించారు. మొదటిది, భారీ అగ్నిపర్వతాల విస్ఫోటనం, గ్రహశకలాల దాడి లేదా అణు యుద్ధం వంటి వాటి వల్ల సూర్యరశ్మి భూమికి చేరకపోవడం. రెండోది, భయంకరమైన సైబర్ దాడులు, మహమ్మారులు లేదా భూ అయస్కాంత తుపానుల వల్ల విద్యుత్, రవాణా, ఆహార వ్యవస్థలు కుప్పకూలడం. మూడోది, ఖండాలను నాశనం చేసే స్థాయిలో ప్రాణనష్టం కలిగించే జీవసంబంధమైన ముప్పులు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ కీలకమైన వ్యవస్థలను కాపాడుకుంటూ మానవ మనుగడను కొనసాగించగల సామర్థ్యం ఆస్ట్రేలియాకే

## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ విజయవంతం.. హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు..

**సంతృప్తికరంగా ముగిసిన వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్**

**కొల్లం వాగు వద్ద గేట్లు ఎత్తి సొరంగంలోకి కృష్ణా జలాల విడుదల**

**రేపు ప్రాజెక్టును జాతికి అంకితం చేయనున్న సీఎం చంద్రబాబు**

**ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల కరవు ప్రాంతాలకు తీరనున్న నీటి కష్టాలు**




ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది. ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు, సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.



## హైదరాబాద్ నర్సు హత్య కేసులో వీడిన మిస్టరీ.. అత్యాచార యత్నం అడ్డుకోవడంతో హత్య

**హైదరాబాద్‌లో నర్సుది హత్యేనని తేల్చిన పోలీసులు**

**అత్యాచార యత్నాన్ని ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య**

**బీహార్‌కు చెందిన సైనావుల్లా అనే వ్యక్తి అరెస్ట్**

**నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కుటుంబసభ్యుల ఆందోళన**

నగరంలోని పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 21 ఏళ్ల నర్సు అనుమానాస్పద మృతి కేసులో మిస్టరీ వీడింది. ఆమెది హత్యేనని పోలీసులు నిర్ధారించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన బీహార్ వాసి సైనావుల్లాను అరెస్ట్ చేశారు. అత్యాచార యత్నాన్ని ఆమె తీవ్రంగా ప్రతిఘటించడంతోనే గొంతు నులిమి హత్య చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. వివరాల్లోకి వెళితే, కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి ఏడు నెలల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్ వచ్చింది. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. విధుల్లో భాగంగా ఆమె ఆసుపత్రిలోనే కేటాయించిన గదిలో నివసిస్తోంది. శనివారం మధ్యాహ్నం గదిలోకి వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ఆసుపత్రి సిబ్బందికి అనుమానం వచ్చింది. వారు తలుపులు విరగ్గొట్టి చూడగా, యువతి నేలపై విగతజీవిగా పడి ఉంది. ఆమె శరీరంపై గాయాలు ఉండటంతో బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఘటనా స్థలంలోని ఆధారాలను బట్టి ఇది హత్యగా అనుమానించారు. విచారణలో భాగంగా, ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న సైనావుల్లా అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో అతను నేరం అంగీకరించాడు. శనివారం మధ్యాహ్నం కిటికీలోంచి నర్సు గదిలోకి దూకి ఆమెపై అత్యాచారానికి ప్రయత్నించినట్లు తెలిపాడు.

# బిజినెస్

## కియా 'సొరెంటో' వచ్చేస్తోంది.. ఫార్చ్యూనర్ కు సరైన పోటీ?




భారత ఆటోమొబైల్ మార్కెట్‌లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కియా ఇండియా, ఇప్పుడు ప్రీమియం సెగ్మెంట్‌పై దృష్టి సారించింది. తన ఫ్లాగ్‌షిప్ ఇంటర్నల్ కంబస్టన్ ఇంజిన్ ఎస్‌యూవీ అయిన 'కియా సొరెంటో'ను సెప్టెంబర్ 4న దేశీయ మార్కెట్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. కేవలం అమ్మకాల కోసమే కాకుండా, బ్రాండ్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లే వ్యూహంలో భాగంగా ఈ కొత్త వాహనాన్ని కియా తీసుకువస్తోంది.ప్రస్తుతం భారత మార్కెట్‌లో సెల్టోస్, సోనెట్, కారెన్స్, కార్నివాల్ మోడళ్లతో కియా మంచి విజయాన్ని అందుకుంది. సెల్టోస్ మెయిన్‌స్ట్రీమ్ ఫ్లాగ్‌షిప్‌గా ఉండగా, ఈవీ6 ఎలక్ట్రిక్ విభాగంలో ప్రీమియం ఆఫర్‌గా ఉంది. ఈ రెండింటి మధ్య ఉన్న ఖాళీని భర్తీ చేస్తూ, మూడు వరుసల సీటింగ్‌తో వచ్చే సంప్రదాయ ప్రీమియం ఎస్‌యూవీగా సొరెంటో నిలవనుంది. సుమారు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల ధరల శ్రేణిలో విడుదలయ్యే అవకాశం ఉన్న ఈ కారు... టయోటా ఫార్చ్యూనర్, స్కోడా కొడియాక్, టయోటా ఇన్నోవా హైక్రాస్, జీప్ మెరిడియన్ వంటి బలమైన పోటీదారులను ఢీకొట్టనుంది. ఈ కారులో అత్యంత కీలకమైన అంశం దాని హైబ్రిడ్ ఇంజిన్. 1.6-లీటర్ టర్బో-పెట్రోల్ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్‌తో ఇది రానుంది. ఇది సుమారు 235 ఎచ్‌పీ శక్తిని, 380 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుందని అంచనా. డీజిల్ వాహనాలకు ప్రత్యామ్నాయం చూస్తూ, పూర్తిస్థాయి ఎలక్ట్రిక్ వాహనాలపై ఇంకా సంశయిస్తున్న కొనుగోలు దారులకు ఇది చక్కటి ఆప్షన్‌గా నిలుస్తుంది. రిఫైన్‌మెంట్, అధిక మైలేజీ, అద్భుతమైన పనితీరును ఒకే ప్యాకేజీలో అందించడం దీని ప్రత్యేకత. ఇప్పటికే టయోటా హైబ్రిడ్ కార్లతో విజయవంతమైన నేపథ్యంలో, కియా కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తోంది.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈవో శశిధర్ జగదీశన్ పదవీ విరమణ

భారత ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) శశిధర్ జగదీశన్ తన పదవీ విరమణను ప్రకటించారు. తన పదవీకాలాన్ని పొడిగించేందుకు ఉద్దేశించిన పునర్‌నియామక ప్రతిపాదనను ఆయన సున్నితంగా తిరస్కరించారు. ఆయన ప్రస్తుత పదవీకాలం 2026 అక్టోబర్ 26వ తేదీతో ముగియనుంది.ఈ నిర్ణయంపై పునరాలోచించాలని బోర్డు సభ్యులు కోరినప్పటికీ, జగదీశన్ తన నిర్ణయానికే కట్టుబడి ఉన్నారని బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీల ఫైలింగ్‌లో అధికారికంగా వెల్లడించింది. బ్యాంక్ వృద్ధికి, స్థిరత్వానికి ఆయన అందించిన విశేష సేవలను బోర్డు కొనియాడింది. ముఖ్యంగా దేశ కార్పొరేట్ చరిత్రలోనే అతిపెద్ద విలీన ప్రక్రియ అయిన హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్-హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ విలీనాన్ని విజయవంతంగా పూర్తి చేయడంలో ఆయన చూపిన నాయకత్వ పటిమను బోర్డు ప్రత్యేకంగా ప్రశంసించింది. ఆయన పదవీ విరమణకు ముందే నూతన ఎండీ, సీఈవో నియామక ప్రక్రియను ప్రారంభించినట్లు బోర్డు పేర్కొంది.రెండు దశాబ్దాలకు పైగా బ్యాంక్‌ను నడిపించిన ఆదిత్య పూరి స్థానంలో, 2020 అక్టోబర్‌లో శశిధర్ జగదీశన్ బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన బ్యాంక్‌లో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) సహా పలు కీలక బాధ్యతలు నిర్వహించారు.

## తారుమారైన సీన్.. రష్యాకే పెట్రోల్ ఎగుమతి చేస్తున్న భారత్



అంతర్జాతీయ ఇంధన మార్కెట్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. సాధారణంగా ముడి చమురు కోసం రష్యాపై ఆధారపడే భారత్, ఇప్పుడు అదే రష్యాకు పెట్రోల్ ఎగుమతి చేసే కీలక దేశంగా అవతరించింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడులతో రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) తీవ్రంగా దెబ్బతినడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ఏర్పడిన తీవ్రమైన ఇంధన కొరతను అధిగమించేందుకు రష్యా, భారత్ నుంచి పెట్రోల్‌ను దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది.ఎనర్జీ అనలిటిక్స్ సంస్థ వోర్టెక్సా నివేదిక ప్రకారం.. గత రెండు నెలల్లో (జులై-ఆగస్టు) రష్యా రిఫైనరీలపై సుమారు 32 సార్లు డ్రోన్ దాడులు జరిగాయి. దీనివల్ల దేశీయంగా పెట్రోల్ ఉత్పత్తి ఏకంగా 70% పడిపోయింది. ఫలితంగా రష్యాలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రష్యా ప్రభుత్వం తన దేశం నుంచి పెట్రోల్, డీజిల్ ఎగుమతులను నిషేధించింది. ఈ నేపథ్యంలో భారత్ గత రెండు నెలల్లో దాదాపు 10 లక్షల బ్యారెళ్ల పెట్రోల్‌ను రష్యాకు సరఫరా చేసింది. భారత్‌తో పాటు తుర్కియే, మొరాకో కూడా రష్యాకు ఇంధనాన్ని అందిస్తున్నాయి. గుజరాత్‌లోని వడినార్‌లో ఉన్న నయారా ఎనర్జీ రిఫైనరీ నుంచే ఈ ఎగుమతుల్లో ఎక్కువ భాగం జరిగినట్లు వాణిజ్య వర్గాలు తెలిపాయి. ఈ రిఫైనరీలో రష్యా ప్రభుత్వ రంగ సంస్థ రాస్‌నెఫ్ట్‌కు వాటా ఉండటం గమనార్హం.మరోవైపు, ప్రపంచంలో మూడో అతిపెద్ద రిఫైనర్‌గా ఉన్న భారత్ తన సామర్థ్యాన్ని 272 ఎంఎంటీపీఏ నుంచి 300 ఎంఎంటీపీఏకు పెంచుకోవడం ద్వారా గ్లోబల్ రిఫైనింగ్ హబ్‌గా తన స్థానాన్ని పటిష్ఠం చేసుకుంటోందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇటీవల పేర్కొన్నారు.

## ఆ కోచ్ లు విషపూరితం- బాబర్ వైఫల్యాలకు వారే కారణం
## పాక్ మాజీ క్రికెటర్ యూసుఫ్ మండిపాటు



పాకిస్థాన్ టెస్ట్ కెప్టెన్ బాబర్ అజామ్ సుదీర్ఘకాలంగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటంపై ఆ దేశ మాజీ క్రికెటర్ మహ్మద్ యూసుఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. బాబర్ ఫామ్ కోల్పోవడానికి, అతని టెక్నిక్‌లోని లోపాలను సరిదిద్దుకో లేకపోవడానికి జట్టులోని 'కొందరు కోచ్‌లే' కారణమంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. వారిని "ఆటకు విషం లాంటి వారు" అని అభివర్ణిస్తూ సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశాడు.ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బాబర్ అజామ్ ఔటైన తీరును కామెంటేటర్ నాసిర్ హుస్సేన్ విశ్లేషించిన వీడియోను షేర్ చేస్తూ మహ్మద్ యూసుఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "కొన్నేళ్ల క్రితమే నేను ఈ విషయంపై హెచ్చరించాను. కానీ, బాబర్ చుట్టూ ఉన్న కొందరు నాసిరకం కోచ్‌లు అతనిలోని లోపాలను సరిదిద్దుకో వడానికి అనుమతించలేదు. సులభంగా పరిష్కరించగల సమస్యను కూడా వారు పట్టించుకోలేదు. ఆ వైఫల్యమే ఇప్పుడు పాకిస్థాన్ క్రికెట్‌ను ఈ పతనానికి లాగింది" అని యూసుఫ్ ఎక్స్‌లో పేర్కొన్నాడు."ఈ కోచ్‌లు ఆట పట్ల విషపూరితమైన వారు. వారికి విజన్ లేదు, పురోగతిని అడ్డుకుంటారు, ప్రతిభా వంతులైన ఆటగాళ్లను తప్పుదోవ పట్టిస్తారు. మన క్రికెటర్లు ఎవరి మాట వినాలో నేర్చుకోకపోతే వారి కెరీర్లు అనుకున్నదానికంటే ముందే ముగుస్తా యి. మన ఆటగాళ్ల బలహీ నమైన టెక్నిక్ ఇప్పుడు బంగ్లాదేశ్ నుంచి ఇంగ్లండ్ వరకు బట్టబయలైంది" అని మండిప డ్డాడు.2022 డిసెంబర్ తర్వాత బాబర్ అజామ్ ఇప్పటివరకు టెస్టుల్లో శతకం నమోదు చేయలేదు. అనేకసార్లు సెంచరీకి చేరువగా వచ్చినప్పటికీ విఫలమయ్యాడు. అతని ఫామ్‌తో పాటు పాకిస్థాన్ జట్టు ప్రదర్శన కూడా దారుణంగా ఉంది. విదేశాల్లో ఆడిన గత 10 మ్యాచ్‌ల్లో పాక్ 9 ఓడిపోయింది. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పాక్ కేవలం 110 పరుగులకే కుప్పకూలింది. పేలవ ఫామ్ కారణంగా 2023 చివర్లో కెప్టెన్సీ కోల్పోయిన బాబర్‌ను, షాన్ మసూద్ సారథ్యంలోనూ జట్టు వైఫల్యాలు కొనసాగడంతో 2026 జులైలో తిరిగి కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

## జడ్డూ నో బాల్స్‌పై గవాస్కర్ ఫైర్- బౌలర్‌తో పాటు కోచ్‌కూ జరిమానా వేయాలన్న సన్నీ!




శ్రీలంకతో జరిగిన రెండో టెస్టు డ్రాగా ముగిసి నప్పటికీ, టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా ప్రదర్శన, ముఖ్యంగా అతని క్రమశిక్షణా రాహిత్యంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిరీస్ ఆసాంతం పదేపదే క్రీజు దాటి బంతులు విసిరిన జడేజా తీరుపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశాడు. కేవలం ఆటగాడికే కాకుండా, బౌలింగ్ కోచ్‌కు కూడా జరిమానా విధిం చాలని సన్నీ సంచలన సూచన చేశాడు. శ్రీలంకతో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌లో రవీంద్ర జడేజా పలుమార్లు నో బాల్స్ వేశాడు. గణాంకాల ప్రకారం.. 2021 నుంచి ఇప్పటివరకు అతను 85కి పైగా నో బాల్స్ వేశాడంటే అతని బౌలింగ్‌లో క్రమశిక్షణ ఎంతగా లోపించిందో అర్థం చేసుకోవచ్చు. జడేజానే కాకుండా, అరంగేట్ర స్పిన్నర్ సారాంశ్ జైన్ కూడా రెండో టెస్టులో అనేక నో బాల్స్ వేసి నిరాశపరిచాడు. ఈ వ్యవహారంపై భారత స్పిన్ బౌలింగ్ కోచ్ సాయిరాజ్ బహుతులే స్పందిస్తూ.. "టెస్టుల్లో కూడా నో బాల్స్‌కు ఫ్రీ హిట్ పెడితే బౌలర్లు జాగ్రత్త పడతారేమో" అని సరదాగా వ్యాఖ్యానించాడు. అయితే, కోచ్ వ్యాఖ్యలపై సునీల్ గవాస్కర్ తీవ్రంగా మండిపడ్డాడు. "టెస్టు క్రికెట్‌లో బ్యాటర్లకు పరుగులు చేయడం ఇప్పటికే చాలా సులభంగా మారింది. ఓవర్‌కు రెండు బౌన్సర్ల పరిమితి, బౌండరీ లైన్లను దగ్గరకు జరపడం వంటివి ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఫ్రీ హిట్‌లు ప్రవేశపెట్టి బ్యాటింగ్‌ను మరింత సులభతరం చేయొద్దు" అని గవాస్కర్ ఘాటుగా పేర్కొన్నాడు. నో బాల్స్ వేయకుండా ఉండటం అనేది పూర్తిగా ఆటగాళ్ల నియంత్రణలో ఉండే అంశమని, టేప్ మెజర్‌తో రనప్ మార్క్ చేసుకునే ఈ ఆధునిక రోజుల్లో ఇలాంటి పొరపాట్లకు క్షమాపణలు ఉండవని స్పష్టం చేశాడు.ఈ సమస్యకు పరిష్కారంగా గవాస్కర్ కొన్ని ఆసక్తికర సూచనలు చేశాడు. "నో బాల్ వేసిన ఆటగాడికి భారీ జరిమానా విధించాలి. అదే తప్పు మళ్లీ పునరావృతం చేస్తే ఆ జరిమానాను రెట్టింపు చేయాలి. అంతటితో ఆగకుండా, ఆటగాడి జరిమానాలో సగం మొత్తాన్ని బౌలింగ్ కోచ్‌కు కూడా విధించాలి. అప్పుడే బాధ్యత పెరుగుతుంది" అని అన్నాడు. ఈ జరిమానాల ద్వారా వసూలైన మొత్తంతో సిరీస్ చివరలో టీమ్ సభ్యులందరికీ డిన్నర్ ఏర్పాటు చేయవచ్చని, ఇది జట్టులో బంధాన్ని మరింత పెంచుతుందని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. అంతేకాకుండా ఫీల్డింగ్‌లో త్రోను బ్యాకప్ చేయకపోవడం వంటి ఇతర చిన్న పొరపాట్లకు కూడా జరిమానాలు విధించే ఆలోచనను జట్టు సభ్యులు ఓటింగ్ ద్వారా నిర్ణయించుకోవచ్చని, ఇది ఒక సరదా కార్యకలాపంగా మారుతుందని పేర్కొన్నాడు.

# స్పోర్ట్స్

## దులీప్ ట్రోఫీలో చారిత్రక ఘట్టం
## 15 ఏళ్లకే కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ



భారత దేశవాళీ క్రికెట్‌లో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. కేవలం 15 ఏళ్ల వయసున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, దులీప్ ట్రోఫీ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో ఈస్ట్ జోన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి అందరినీ ఆశ్చర్యపరిచాడు.

బెంగళూరు వేదికగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌లో రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడటంతో, వైస్ కెప్టెన్‌గా ఉన్న వైభవ్ ఈ అనూహ్య బాధ్యతలను స్వీకరించాడు.మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ సందర్భంగా ఈ సంఘటన చోటుచేసుకుంది. వికెట్ కీపింగ్ చేస్తున్న ఇషాన్ కిషన్ కుడి చేతి మణికట్టుకు బంతి బలంగా తాకింది. మైదానంలోనే ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ, నొప్పి తీవ్రంగా ఉండటంతో అతను మైదానాన్ని వీడాల్సి వచ్చింది. అనంతరం అతని చేతికి పెద్ద కట్టుతో డగౌట్‌లో కనిపించాడు. దీంతో ఇషాన్ స్థానంలో కుమార్ కుశాగ్ర వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టగా, కెప్టెన్సీ పగ్గాలు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చేతికి వచ్చాయి. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇంత చిన్న వయసులో ఒక సీనియర్ జట్టుకు నాయకత్వం వహించడం ఒక అరుదైన రికార్డుగా నిలిచింది.వాస్తవానికి, ఈ టోర్నీకి ముందు వైభవ్ సూర్యవంశీని వైస్ కెప్టెన్‌గా నియమించడంపై దేశవాళీ క్రికెట్ వర్గాల్లో కొంత చర్చ జరిగింది. అయితే, ఈస్ట్ జోన్ సెలక్టర్లు తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. స్వల్పకాలిక అవసరాల కోసం కాకుండా భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దేందుకే ఈ కుర్రాడికి ఈ బాధ్యతలు అప్పగించామని స్పష్టం చేశారు. 2024 ఆరంభంలోనే ఫస్ట్ క్లాస్ అరంగేట్రం చేసిన వైభవ్‌కు ఇది కేవలం పదో ఫస్ట్ క్లాస్ మ్యాచ్, రెండో దులీప్ ట్రోఫీ మ్యాచ్ మాత్రమే.


## డీఎస్పీ 'ఎల్లమ్మ'లో హీరోయిన్ ఫిక్స్ యంగ్ బ్యూటీకి జాక్‌పాట్!

'బలగం' చిత్రంతో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న దర్శకుడు వేణు ఎల్దండి తన తదుపరి ప్రాజెక్ట్ 'ఎల్లమ్మ'ను ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రం ద్వారా కథానాయకుడిగా పరిచయం అవుతుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్ ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. 'మ్యాడ్', '8 వసంతాలు' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ బ్యూటీ అనంతిక సనిల్‌కుమార్‌ను కథానాయికగా ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర కోసం చిత్ర బృందం సాయిపల్లవి, కీర్తి సురేష్, మృణాల్ ఠాకూర్ వంటి పలువురు ప్రముఖ హీరోయిన్ల పేర్లను పరిశీలించింది. అయితే, చివరికి అనంతికతో ప్రత్యేకంగా లుక్ టెస్ట్, ఫోటోషూట్ నిర్వహించారు. ఆమె నటన, లుక్స్‌పై దర్శకుడు వేణు, నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడంతో ఆమెనే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. దీనిపై శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నుంచి త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది. ఈ చిత్రంలో దేవిశ్రీ ప్రసాద్ 'పర్షి' అనే డప్పు కళాకారుడి పాత్రలో కనిపించనున్నారు. 'బలగం' తరహాలోనే ఈ సినిమా కూడా గ్రామీణ సంస్కృతి, మానవ సంబంధాల పునాదులపై రూపుదిద్దుకుంటోంది. గ్రామ దేవత ఎల్లమ్మను నమ్ముకుని, తరతరాలుగా జానపద కళలతో జీవనం సాగించే కళాకారుల జీవితమే ఈ చిత్ర కథాంశం. సమాజంలో కళాకారులు ఎదుర్కొనే వివక్ష, అవమానాలను అధిగమించి తమ ఆత్మగౌరవాన్ని ఎలా నిలబెట్టుకున్నారనే సంఘర్షణను దర్శకుడు వేణు అత్యంత సహజంగా, భావోద్వేగభరితంగా చూపించనున్నారు. ఒకవైపు కథానాయకుడిగా నటిస్తూనే, మరోవైపు ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ స్వయంగా సంగీతం అందిస్తుండటం విశేషం. గ్రామీణ వాతావరణం, జానపద కళల నేపథ్యంతో వస్తున్న 'ఎల్లమ్మ' చిత్రం, ప్రేక్షకులకు మరో గొప్ప అనుభూతిని ఇస్తుందని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.



## నెట్‌ఫ్లిక్స్‌లోకి 'కొరియన్ కనకరాజు'-స్ట్రీమింగ్ డేట్ ఇదే!

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో మంచి విజయం సాధించిన ఈ హారర్ కామెడీ సినిమా ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. సెప్టెంబర్ 4 నుంచి ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో అందుబాటులో ఉంటుందని చిత్ర బృందం ప్రకటించింది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించింది. ఆగస్టు 7న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, ప్రేక్షకులనుంచి మంచి స్పందన రాబట్టుకుంది. ఇప్పుడు థియేటర్లలో విడుదలైన సుమారు నాలుగు వారాలకే ఈ సినిమా ఓటీటీలోకి వస్తుండటం గమనార్హం. సినిమా డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు కొనుగోలు చేసింది. ఇక కథ విషయానికి వస్తే, అనంతపురంకు చెందిన కనకరాజు (వరుణ్ తేజ్) చెక్కభజనలు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ముక్కుసూటి మనస్తత్వం, కోపం ఎక్కువ. కొరియా వెళ్లాలనే కలతో ఉన్న చైత్ర (రితికా నాయక్) అనే యువతితో ప్రేమలో పడతాడు. ఈ క్రమంలో కొరియా నుంచి వచ్చిన ఒక వస్తువు ద్వారా ఓ విచిత్రమైన ఆత్మ కనకరాజు శరీరంలోకి ప్రవేశిస్తుంది. దీంతో అతని ప్రవర్తనలో అనూహ్య మార్పులు వస్తాయి. ఈ సమస్య నుంచి బయటపడటానికి స్నేహితులతో కలిసి కొరియాకు వెళతాడు. అసలు ఆ ఆత్మ ఎవరు? కనకరాజును ఎందుకు ఆవహించింది? చివరికి అతను తన ప్రేమను గెలిపించుకున్నాడా? అనే అంశాలతో ఈ సినిమా వినోదాత్మకంగా సాగుతుంది. థియేటర్లలో ఈ హారర్ కామెడీని చూడలేక పోయిన ప్రేక్షకులు ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్‌లో చూసి ఎంజాయ్ చేయవచ్చు.




## విదేశాంగ శాఖ చూసిన సినిమా- 'సీక్రెట్ సోల్జర్' ట్రైలర్ రిలీజ్



నిహాల్ కోదాటి కథానాయకుడిగా నటిస్తున్న స్పై యాక్షన్ డ్రామా 'సీక్రెట్ సోల్జర్'. అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో హీరో నిహాల్ కోదాటి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించాడు. ఈ ఏడాది విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిశీలనకు వెళ్లిన కేవలం మూడు భారతీయ చిత్రాల్లో 'సీక్రెట్ సోల్జర్' ఒకటని ఆయన తెలిపాడు. సల్మాన్‌ఖాన్ నటించిన 'మాతృభూమి', 'ధురంధర్' మిగిలిన రెండు చిత్రాలని పేర్కొన్నాడు. ఈ సినిమా దాదాపు ఎనిమిది నెలల పాటు సెన్సార్ బోర్డు పరిశీలనలో ఉందని, అక్కడ అందరినీ మెప్పించిన తర్వాతే ఇప్పుడు విడుదలకు సిద్ధమైందని రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి తెలిపారు. ట్రైలర్ చూస్తుంటే చిత్రబృందం పడిన కష్టం స్పష్టంగా కనిపిస్తోందని, ఇదే నాణ్యతను సినిమాలోనూ కొనసాగిస్తే విజయం ఖాయమని ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు శైలేష్ కొలను ఆకాంక్షించాడు. ఈ చిత్రంలో యాక్షన్‌తో పాటు బలమైన భావోద్వేగాలు ఉన్నాయని, అవే సినిమాను నిలబెడతాయని నటుడు సూర్య శ్రీనివాస్ తెలిపాడు. ప్రతి ఒక్కరూ గర్వపడేలా ఈ సినిమాను సాంకేతికంగా ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దామని దర్శకుడు విశ్వనాథ్ ధీమా వ్యక్తం చేశాడు. ఈ చిత్రంలో సూర్య శ్రీనివాస్, హర్షిత, శ్రీషా, కమల్ కామరాజు, శ్రీనివాస్ వడ్లమాని తదితరులు కీలక పాత్రలు పోషించారు.




printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com